# ఆరుగాలం కరువు

అనంతపురం జిల్లా వ్యవసాయ
సంక్షోభంపై నివేదిక

**మానవహక్కుల వేదిక ప్రచురణ**
Human Rights Forum Publication

# ఆరుగాలం కరువు

అనంతపురం జిల్లా వ్యవసాయ
సంక్షోభంపై నివేదిక

**మానవహక్కుల వేదిక ప్రచురణ**
Human Rights Forum Publication


। ప్రచురణ సంఖ్య : 12
। ప్రచురణ కాలం : మే 2005
। కాపీలు : 2000 । వెల : 5 రూపాయలు
। కవర్ : మోహన్
। ముద్రణ : నవ్య ప్రింటర్స్



ప్రతులకు :
**ఎస్.జీవన్ కుమార్**
3-12-117/ఏ-2/1, పి.ఎస్.కాలనీ,
గణేష్‌నగర్, రామంతాపూర్
హైదరాబాద్-13. ఫోన్: 27039519


**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

# ముందుమాట

**వ్య**వసాయ సంక్షోభం అనే ప్రయోగమిప్పుడు సార్వజనీనమయింది. ఆదాయ వ్యయాల లెక్కలు తీస్తే వ్యవసాయం మొత్తం మీద నష్టదాయకంగానే ఉంటుందని పరిశోధకులు సీరియస్‌గానే చెప్తున్నారు. అయినప్పటికీ తిండి అందరికీ కావాలి కాబట్టి వ్యవసాయ సంక్షోభాన్ని రైతులు, రైతు కూలీల నెత్తిమీద పడేయకుండా ఆ బరువును అందరూ మోయాలని అంటున్నారు.

సార్వజనీనమైనా దానికి స్థానిక ప్రత్యేకతలు చాలా ఉంటాయి. కొన్నిచోట్ల సంక్షోభం మిగులు ఆదాయంలోని ఆటుపోట్ల రూపంలో ఉంటే కొన్నిచోట్ల అసలు ఆదాయంలోని ఆటుపోట్ల రూపంలోనే ఉంటుంది. కొన్నిచోట్ల వ్యవసాయం మెరుగయిన జీవితాన్ని ఇవ్వలేకపోతున్నదే అన్నది ఫిర్యాదయితే కొన్నిచోట్ల అసలు జీవితాన్ని నిలపలేకపోతున్నదే అన్నది ఫిర్యాదు.

అత్యల్ప వర్షపాతం, చాలావరకు సారహీనమయిన నేలలు, ప్రత్యామ్నాయ నీటివనరుల లేమి కలిసి అనంతపురం జిల్లాను రెండవ కోవకు చెందిన అతి ప్రముఖమైన ప్రాంతాలలో ఒకదానిని చేశాయి. అయినప్పటికీ బతకాలి కాబట్టి, అత్యధిక మెజారిటీకి వ్యవసాయంలోనే బతుకు ఉంది కాబట్టి, అత్యంత అననుకూలమయిన ఈ పరిస్థితిని కూడా ఎదుర్కొని లక్షలాది రైతులు, కూలీలు బతుకుపోరు సాగిస్తూనే ఉన్నారు. ఎడాపెడా పెరిగిపోయిన వేరుశెనగ సాగు దీనికొక సంకేతం అయింది. ఆ సంకేతమూ ఈరోజు సంక్షోభంలో పడడంతో ఇంక ముందుకెట్లాగ అన్న ప్రశ్న ఈ జిల్లాను పట్టి పీడిస్తున్నది. వ్యక్తులుగా చాలామంది రైతులు ఈ ప్రశ్నకు జవాబు వెతుక్కున్నారు, ఎవరికీ తెలియకుండా దానిని అమలు చేస్తున్నారు. ఐదేళ్లలో ఐదువందల మంది దాకా చనిపోయారు. ఈ చావులను ఆత్మహత్యలు అంటున్నాం. అయితే బతికి కొట్లాడుదాం అనుకున్నవారికి మాత్రం మార్గం కనిపించడం లేదు.

ఈ సంక్షోభ చరిత్ర గురించి, వర్తమాన పరిస్థితి గురించి మానవ హక్కుల వేదిక సీనియర్ సభ్యుడు ఎస్.ఎం.బాషా 'కదలిక' పత్రికలో అనేక పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. వాటన్నిటినీ కలిపి చదువుకున్నట్టయితే వ్యవసాయ సంక్షోభాన్ని గురించి ఒక అవగాహన ఏర్పడగలదని భావించి వాటిని ఒక పుస్తకంగా ప్రచురిస్తున్నాము. ఇదంతా చదివాక బాషా గారు ఈ జిల్లా వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారమేదీ చూపలేదే అనేవారు ఉంటారు. నిజమే చూపలేదు. పరిష్కారం కోసం వెతికే పేరుమీద రైతునే నిందించే నీతి ప్రబలంగా ఉన్న ఈ పరిస్థితిలో ముందుగా కారణాల విశ్లేషణ సక్రమంగా సాగేటట్టు చూడడం అవసరం. ఒక తీవ్ర సంక్షోభంలోకి రైతాంగాన్ని నెట్టేసి, ఏదో ఒక విధంగా బతికి బట్టకట్టాలన్న తపనతో పరిస్థితులతో పోరాడుతున్న రైతులను తెలివితక్కువవాళ్లని చేసి, ఆ తెలివితక్కువతనమే పరిష్కారానికి ఆటంకం అని వాదించడం ఇప్పుడు జరుగుతోంది. అంతకంటే అన్యాయం ఇంకొకటి ఉండబోదు. చర్చను దానినుండి బయటపడేసి వాస్తవిక భూమికపైన నిలబెట్టడం ప్రథమ అవసరం. దానికి కావలసిన సమాచారాన్నీ దృష్టికోణాన్నీ అందించడం ఈ వ్యాసాలలో జరిగిన కృషి.

ఈ రోజు అందరూ చర్చిస్తున్న పరిష్కారాన్ని ఆవిష్కరించడంలో ఈ కృషి పనికొస్తుందని మా ఆశ.

1 మే 2005

**మానవహక్కుల వేదిక**

అనంతపురం జిల్లా శాఖ

# చెరువుల వ్యవస్థ

**అ**నంతపురం జిల్లా కరువు ఈనాటిదేం కాదు. చరిత్ర తెలిసినప్పటినుంచి కూడా ఈ జిల్లా కరువులకు గురవుతూనే వుంది. ఒకవైపు పశ్చిమ కనుమలు, మరోవైపు వింధ్య పర్వతాలు అడ్డుగా ఉన్నందువల్ల ఈ జిల్లా వర్షచ్ఛాయా ప్రదేశంగా మారి నిత్యం కరువులు కాటకాలకు ఆలవాలమైపోయింది. లభ్యమవుతున్న వందేళ్ళ వర్షపాతం వివరాల్ని పరిశీలిస్తే మిగతా ప్రాంతాలకంటే ఇక్కడ ఎప్పుడూ అతి తక్కువ వర్షపాతం నమోదవుతూనే వుంది. ఇక్కడి సగటు వర్షపాతం 542 మి.మీ. ఇది దేశంలోనే- రాజస్థాన్‌లోని జైసల్మేర్ తరువాత-రెండవ తక్కువ వర్షపాతం గల జిల్లాగా గుర్తింపు పొందడాన్ని బట్టి ఈ జిల్లా చరిత్ర కరువుల చరిత్రగానే మనకు దర్శనమిస్తుంది. మిగతా ప్రాంతాలలోలాగా ఈ జిల్లాలో జీవనదులు లేవు. పెన్నానది ఒక్కటే చెప్పుకోదగ్గ నది. ఇది కూడా ఎప్పుడు పారుతుందో తెలియదు. ఒక్కొక్కసారి ఎంత వేగంగా ప్రవహిస్తుందో, అంతే వేగంగా ఆగిపోతుంది. ఉప్పొంగి ప్రవహించినప్పుడు చుట్టు పట్ల గ్రామాలను ముంచెత్తుతుంది కాబట్టి దీనికి ప్రజలు 'పీనుగుల పెన్న' అని పేరు కూడా పెట్టారు. ప్రస్తుతం ఇది కూడా పారడం మానేసింది.

ప్రకృతి నిరాదరణతో వ్యవసాయం దుర్భరం కావడం మూలాన ఈ జిల్లాలో జనావాసాలు కూడా ఎక్కువగా అభివృద్ధి చెందినట్లు కనిపించదు. పాలకులు అనేక రాయితీలిచ్చి ఇతర ప్రాంతాల నుంచి ప్రజల్ని తెచ్చి భూముల్ని సాగుబడిలోకి తేవడానికి కృషి చేసినట్లుగా చారిత్రక ఆధారాల్ని బట్టి తెలుస్తూంది. ప్రజలు ఈ ప్రాంతంలో వుండడానికి, వ్యవసాయం అభివృద్ధి చేయడానికి పాలకులు, ప్రజలు కలిసి వర్షాన్ని నిలువ చేయడానికి మార్గాలు వెతికారు. దాని ఫలితమే ఈ జిల్లాలో విస్తారంగా మనకు కానవచ్చే చెరువులు, కుంటలు, బావులు. ఈ జిల్లా విజయనగర పాలనలో తప్ప మిగతా కాలమంతా పరోక్షపాలనలో వుంది. రాజకీయ అననుకూల పరిస్థితులలో కూడా ఈ జిల్లాలో వ్యవసాయాన్ని అభివృద్ధిపర్చడానికి జరిగిన ప్రయత్నాలు మరువలేనివి. వీటి గురించి తెలుసుకునే ముందు జిల్లా అనుభవించిన కరువులతో రేఖామాత్రంగానైనా పరిచయం అవసరం.

## కరువుల చరిత్ర

కరువులు ఈ జిల్లాను బాగా కుంగదీసినాయి. 1390-91లో కరువు తీవ్రతను తెలియజేస్తూ కదిరిలోని నరసింహస్వామి గుడిలో ఒక శాసనం వుంది. కరువు బారినపడి ఆ సంవత్సరం వేలాదిమంది చనిపోయినట్లుగా తెలుస్తూంది. 1803 కరువులో విపరీతంగా తిండిగింజల కొరత ఏర్పడింది. 1823, 1832, 1834, 1853, 1865 కరువులు ఈ జిల్లాను పీల్చి పిప్పి చేసినట్లుగా బ్రిటీష్ అధికారులు నివేదికలు పంపారు. తిండిగింజలు, పశువుల మేత లేక ప్రజలు అష్టకష్టాలుపడ్డారు. 1876-78లో భయంకరమైన ధాతుకరువు వచ్చింది. బ్రిటిష్ ఇండియాలో ఇదే భయంకరమైన కరువుగా అభివర్ణించారు. జిల్లాలో నాలుగవ వంతు పశువులు చనిపోయాయి. చాలాచోట్ల కరువు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆనాటి శానిటరీ కమీషనర్ రిపోర్టు ప్రకారం అక్కడికి "వచ్చేవారందరూ చనిపోవడానికే వస్తున్నారు". ప్రతి రెండు మూడేళ్ళకొకమారు జిల్లామీద కరువులు దాడి చేస్తూనే వున్నాయి.

కరువుల తీవ్రత వల్ల గ్రామాలలోని రైతులు శిస్తులు కట్టలేక ఊళ్ళు ఖాళీచేసి వలస వెళ్లడం కూడా జరిగింది. సదాశివరాయలు (1543-76) కాలంలో ఉరవకొండ మండలంలోని చాబాల గ్రామ ప్రజలు పన్నులు ఇచ్చుకోలేక ఊరువదిలి పోయారు. ఈ ప్రాంతాన్ని అమర మాగానిగా పొందిన కొండయదేవర మహారసు ప్రజల్ని మళ్లీ వెనక్కి పిలిపించి పాతపన్నులే తీసుకుంటానని సమాధానపర్చారు. మూడు సంవత్సరాల వరకూ కానుకలు, పూజపన్ను, శిస్తులు, వెట్టి చేయనక్కరలేదని హామీ ఇచ్చాడు. కరువులు వచ్చినప్పుడు ప్రజలు పెద్దఎత్తున వలసపోవడం ఈ జిల్లాకు సర్వసాధారణమే. గ్రామాలు కేవలం వ్యవసాయం మీదనే బతికేవి కనుక బంజర్లుగా పడివున్న భూముల్ని సాగులోకి తెచ్చేందుకు ప్రోత్సహించేవారు. అడవులు కొట్టి వ్యవసాయం చేసుకునేందుకు హరిహరరాయలు భూముల్ని ప్రజలకు కౌలుకు ఇచ్చాడు. వారికి పన్నుల విషయంలో రాయితీలు కూడా ఇచ్చాడు. జనాల్ని తీసుకువచ్చి వ్యవసాయం చేసుకునేటట్లు ప్రోత్సహించిన వారికి గ్రామం మీద 'రెడ్డిరికం' ఇవ్వబడింది. గ్రామాలలో ఖాళీగా పడివున్న భూములను కొన్ని షరతులపై ఆ గ్రామాల రెడ్డి, కరణాలకు కౌలుకిస్తూ స్థానిక పాలకుడు వేయించిన మూడు శాసనాలు దొరికాయి. (ఆంధ్రుల సంస్కృతి చరిత్ర 2వభాగం) 15వ శతాబ్దంలో జిల్లాలోని వేల్పుమడుగు, రాయదుర్గం ప్రాంతాలలో కరువు వల్ల పన్నులు కట్టలేని రైతులకు పన్నులు మినహాయించినట్లుగా తెలుస్తోంది.

అనంతపురం జిల్లా ఎక్కువ కాలం పరోక్ష పాలనకింద వుండేదని ఇదివరకే చెప్పాం. రాజ్యాధికారం తరచూ మారినా పాలకులు ఏ ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకుంటే స్థానిక పాలెగాళ్ళు వారికి విధేయత ప్రకటించేవారు. ఇంతటి ప్రకృతి అననుకూలతలో కూడా



రైతులు బాగా కష్టించి పంటలు పండించేవారని అర్థమవుతున్నది. విదేశీ యాత్రికుడు న్యూనిజ్ (1535) ప్రకారం ఈ జిల్లాలో వరి, గోధుమ, కాయ, పప్పుధాన్యాలు పండించేవారని అర్థమవుతున్నది. తమలపాకు, పోక తోటలు కూడా పెంచేవారని తెలుస్తోంది. జీవనదులు లేని ఈ జిల్లాలో ప్రత్యామ్నాయ మార్గాలు వెతికిన ఫలితమే చెరువులు, కుంటలు.

## చెరువుల నిర్మాణం

12వ శతాబ్దంలో ఈ జిల్లా కాకతీయ రాజుల ఏలుబడిలోకి వచ్చింది. కాకతీయ రాజులు తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికై అప్పటికే చెరువులు, కుంటలు నిర్మించడం మొదలుపెట్టారు. వ్యవసాయం మీద ప్రత్యేక శ్రద్ధ కలిగిన కాకతీయ రాజులు ఈ ప్రాంతంలో కూడా చెరువుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చెరువుల నిర్మాణానికి రైతులు నిర్ణీతమైన మొత్తం చెల్లించాలి. రెండు కొండల మధ్యనో, గుట్టల మధ్యనో నీటి వాలు వున్న ఖాళీలో మట్టికట్టలు పోసి, చెరువుల్ని నిర్మించేవారని, పూర్తిగా పోతమట్టితోనే నిర్మించిన చెరువులున్నాయని కంభంపాటి సత్యనారాయణగారు ఆంధ్రుల చరిత్ర – సంస్కృతిలో ప్రస్తావించారు. ఈ కాలానికి చెందిన అనేక శాసనాల్లో చెరువుల పేర్లు సముద్రాలు, సాగరాలు అని ఉండడం గమనించవచ్చు. అంతేకాదు, వ్యవసాయదారులను కాకతీయ రాజులు బాగా ప్రోత్సహించారని మూడు రాతిపలకల్లోని సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. 13వ శతాబ్దం ప్రథమార్థంలో యాదవ సింగన పరిపాలన కాలంలో అనంతపురం జిల్లా వ్యవసాయదారుల సంఘం గురించిన సమాచారం ఈ రాతి పలకలలో ఉందని కంభంపాటి వారు రాశారు. ఆ సంఘం పేరు చిత్రమేలి (మేలినాగలి). ఇది స్థానిక రైతులు ఏర్పరచుకున్న సంఘం. సంఘం వివరాలు చెక్కిన రాతి పలక మీద నాగలిబొమ్మ, ఎద్దు, పాము, పూర్ణకుంభం బొమ్మలు ఉన్నాయి. ఇటువంటి సంఘం ప్రసక్తి ఇక్కడ తప్ప మరెక్కడా కనపడలేదని కంభంపాటి వారి అభిప్రాయం. అనంతపురం జిల్లాలో వర్షపాతం తక్కువ. కరువులు అధికం కాబట్టి వాటిని తట్టుకొని నిలబడేందుకు రైతులు సమిష్టి వ్యవసాయ పద్ధతులు అవలంబించి ఉండవచ్చునని కంభంపాటి అభిప్రాయపడ్డారు.

కాకతీయ రాజుల కాలంలో సాగిన చెరువుల నిర్మాణం ఆ తర్వాత కాలంలో కూడా కొనసాగుతూ వచ్చింది. పాలకులు, ప్రజలు కూడా చెరువుల్ని తవ్వించడం పుణ్యకార్యంగా భావించారు. చెరువుల్ని తవ్వించినవారిని, మరమ్మత్తులు గావించినవారిని సత్కరించి గౌరవించిన సంఘటనలున్నాయి. చెరువులు, బావులు తవ్వించిన వారికి స్వర్గం ప్రాప్తిస్తుందని ఆనాటి ప్రజలలో విశ్వాసం బలంగా వుండేది. నిర్మాణంతోనే సరిపెట్టకుండా వాటిని నిర్వహించడానికి, సరిఅయిన స్థితిలో ఉంచడానికి ఒక వ్యక్తికో లేదా కొంతమంది వ్యక్తులకో గుత్తకు ఇవ్వడం ఆనవాయితీగా వుండేది. ఆ వ్యక్తి స్వంత ఖర్చుమీద వాటి మరమ్మతులు

చేపట్టవచ్చు లేదా బయానాగా ప్రభుత్వం నుంచి సొమ్ము తీసుకొని పని మొదలుపెట్టవచ్చు. పని పూర్తి చేసినందుకు పాలకులు వారికి కొంత భూమిని ఇస్తారు. కొన్ని సందర్భాలలో గ్రామాలు కూడా ఇవ్వవచ్చు. వాటిమీద పన్నులుండవు. వాటికి వంశపారంపర్య హక్కు వుంటుంది. వీటినే దశబంధ పద్ధతి లేదా కట్టుంగొడుగు అనేవారు. ఈ దశబంధ పద్ధతి ఇంచుమించు రాయలసీమ జిల్లాలన్నింటా వుండేది. దీని గురించి పులివెందుల ప్రాంతంలో ఒక శాసనం కూడా ఉంది.

అనంతపురం జిల్లాలో మూడుచోట్ల తెగిపోయిన ఒక చెరువు కట్టను తన ఖర్చుతో మరమ్మతు చేసి పూడ్చినందులకు వెంకటాద్రి నాయకుని ప్రతినిధి కట్టుంగొడుగు కింద ఇద్దరికి కొంత భూమిని ఇచ్చాడు.మడకశిర తాలూకాలో చెరువు తవ్విన ఇద్దరికి నాలుగు గ్రామాలవారు భూములు ఇచ్చినట్లుగా కంభంపాటి సత్యనారాయణ తన ఆంధ్రుల చరిత్ర – సంస్కృతిలో పేర్కొన్నారు.

విజయనగర రాజ్యపు తొలి రాజులలో ఒకడైన మొదటి బుక్కరాయల మంత్రి చిక్కప్ప ఒడయార్ విజయనగరానికి దక్షిణంగా, నంద్యాల రాష్ట్రంలోని దేవరకొండ సమీపంలో పొండ వాగుకు అడ్డంగా 1365లో కట్ట కట్టించాడు. ఆ కట్టకు తూర్పు గట్టున బుక్కసముద్రం అనీ, పడమటి గట్టున అనంతసాగరం అనీ రెండూళ్ళు కట్టించాడు. (కంభంపాటి – ఆంధ్రుల చరిత్ర సంస్కృతి) ఇదే ప్రస్తుత అనంతపురం చెరువు. కొత్తచెర్వు – బుక్కపట్నం చెరువును కూడా అనంతసాగరమని కైఫీయత్‌లలో ప్రస్తావించారు. 1672లో మరువపల్లి అగ్రహారం వద్ద వేసిన ఒక శిలాశాసనం ప్రకారం రెండవ హరిహరరాయల గురువైన క్రియాశక్తి ఒడయార్ ధర్మవరం, గొట్కూరు మొదలైన ఎన్నో చెరువులను నిర్మించారు. ధర్మవరం పట్టణాన్ని, కోటను కూడా ఆయనే కట్టించాడు. ఈయన తల్లి మేడాంబ ఈ నిర్మాణాన్ని దగ్గరుండి జరిపించేదట. ఈమె మరణించిన తరువాత ఈమె గౌరవార్థం ఒక గ్రామానికి మేడాపురం అని పేరుపెట్టారు. ఈ ధర్మవరం చెరువు 1672లో అధిక వర్షాల వల్ల తెగిపోయింది. తెగిన కట్టకు మరమ్మత్తు గావించినా మళ్లీ తెగిపోయింది. అప్పుడు తిమ్మమ్మ అనే మహిళ తెగిన చెరువుకట్టలో తన్ను తాను సమర్పించుకోవడం వల్ల కట్ట మూసుకుపోయిందని చెప్తారు. ఆమె స్మృతి చిహ్నంగా ధర్మవరం చెరువు కట్టమీద వీరతిమ్మమ్మ గుడి నిర్మించినట్టు చెబుతున్నారు.

చెరువులు నిర్మించడమే కాదు; వాటిని నిర్మించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించిన శాసనం ఒకటి కడప జిల్లా పోరుమామిళ్ళ చెరువులోని రెండు పెద్ద రాళ్ళమీద చెక్కించారు. ఇందులో 12 సూత్రాల్ని పొందుపర్చారు. వాటిలో ముఖ్యమైనవి ఇవి–

కట్ట నిర్మాణానికి ఎంపికచేసిన భూమి గట్టిగా వుండాలి. మూడు ఫర్లాంగుల దూరం



లోపల నది వుండాలి. కొండ దగ్గరగా వుండాలి. కట్టను నల్లటి పెద్దపెద్ద రాళ్ళతో కట్టించాలి. కట్టకు రెండు చివర్లా సాగుభూమి వుండరాదు. చెరువు గర్భం లోతుగానూ, పొడవుగాను, రాతి పొరలతోనూ నిండి వుండాలి. నీటి పారుదల భూములు సారవంతమై వుండాలి. సమతలంగా వుండాలి. నీటిపారుదల సజావుగా పల్లంగా సాగేట్లు వుండాలి.

అలాగే ఆరు లోపాల్ని కూడా గుర్తించి చెక్కించారు. నీటిపారుదల భూమి మరీ ఎక్కువగానూ, మరీ తక్కువగానూ వుండరాదు. కట్టకు వాడే మట్టి, ఇసుక తెరగా ఉండరాదు. చెరువు గర్భం, చివరలు ఎత్తుగా ఉండరాదు. నదిలో పారే నీరు అతి తక్కువగా గానీ, మరీ ఎక్కువగా గానీ ఉండరాదు.

ప్రతిరోజూ వెయ్యిమంది ప్రజలు వంద బళ్ళతో చెరువు నిర్మాణంలో పాల్గొనగా, పూర్తవడానికి రెండు సంవత్సరాల కాలం పట్టినట్టుగా కూడా దానిలో వుంది.

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కాలంలో నీటి వనరులను పరిశీలించడం, నిర్మాణాల్ని చేపట్టడం, ఆయకట్టును అభివృద్ధి పర్చడం సామాన్యమైన విషయాలు కావు. ఏమాత్రం సిమెంటు, ఇనుము లేకుండా సహజ వనరులతో నిర్మించిన ఆనకట్టలు ఇప్పటికీ సాంకేతిక నైపుణ్యానికి గీటురాళ్ళుగా నిలుస్తున్నాయి. కృష్ణదేవరాయల కాలంలో ముద్ద అనే దండనాయకుడు కట్టించిన పది చిన్న చెరువులను పరిశీలించిన బ్రిటిష్ నిపుణుడు మేజర్ హాండర్సన్ ఇవి గొప్ప సాంకేతిక పరిజ్ఞానాన్ని కనపరుస్తున్నాయని శ్లాఘించాడు. ఈ పది చెరువులు దాదాపు 13,200 ఎకరాలకు నీటిపారుదల సౌకర్యాన్ని కలిగించాయి. 1852లో బ్రిటిష్ అధికారులు రూపొందించిన 'రిపోర్ట్ ఆన్ పబ్లిక్ వర్క్స్'లో ఈవిధంగా పేర్కొన్నారు. "ఆనకట్టల కొరకు ప్రదేశాలు ఎంపిక చేయడంలోనే గొప్ప సాంకేతిక విజ్ఞానాన్ని ప్రదర్శించారు. చెరువు నుండి తవ్విన కాలువలు చెరువు గర్భానికి ఎత్తులో వుండి చిన్న గుట్టలు, కొండలకానుకుని సులభంగా పారేలా ఉన్నాయి. కొండ రాతి పొరలు లేని ప్రాంతంలో సున్నం, ఇటుకలతో కాలువ గట్లు నిర్మించారు."

1800లో ఈ ప్రాంతం మొత్తం బ్రిటీష్‌వారి ఏలుబడిలోకి వెళ్ళిన తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం సర్ థామస్ మన్రోను ప్రిన్సిపల్ కలెక్టరుగా నియమించింది. ఈ జిల్లాను అభివృద్ధి కోసం వ్యవసాయ వసతులు పెంచడానికి ఆయన సర్వే చేయించాడు. జిల్లాలో చెరువులు నిర్మించిన తీరు, వాటి నిర్మాణానికి ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. తాను చేయడానికి ఏమీ మిగల్లేదని వ్యాఖ్యానించాడు. చెరువు కట్టలు నిర్మించిన ప్రదేశాల్ని పరిశీలించినపుడు దాదాపు అన్ని చెరువులూ భూమిలో డైక్ (DIKE) పొరలున్న చోట నిర్మించినట్లుగా తెలిసింది. ఈ డైక్ పొరల వల్ల భూమి గట్టిగా వుండి, చెరువులోని నీరు బయటికి లీక్ కాకుండా వుంటుంది.

## ప్రజల భాగస్వామ్యం

**చె**రువులు గ్రామ జీవన సంస్కృతిలో ఒక ప్రధాన భాగంగా వుండేవి. జిల్లాలో తక్కువ వర్షాలు కురిసినా, వాటివల్ల పారే వంకలు, వాగులు వృధాగా సముద్రంలో కలవకుండా ఎక్కడికక్కడ చెరువులు, కుంటలు అభివృద్ధి చేశారు. వ్యవసాయానికి ఉపయోగపడే చెరువులే కాకుండా, పశువులు, పక్షులకు తాగునీటికి ఉపయోగపడే ఊట చెరువులు, కుంటలు కూడా నిర్మించారు. ఈనాడు ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో రూపొందించిన వాటర్ షెడ్ దృక్పథానికి ఏమీ తీసిపోని పద్ధతినే ఆనాడూ అభివృద్ధి చేశారు. ఒక చెరువు నుండి మరవ పారితే దాదాపు 10-12 చెరువులు అదే వరుసలో ఒకదాని తరువాత ఒకటి నిండిపోయే పద్ధతిలో రిజర్వాయర్లుగా ఉపయోగపడ్డాయి. చెరువులు నిర్మించిన తరువాత చెరువు నిర్వహణకు కూడా ఒక విధానాన్ని అభివృద్ధి చేశారు. చెరువు నీటితో ఎన్ని ఎకరాల భూమికి నీరు పారించవచ్చునో అన్ని ఎకరాల భూమిని మాత్రమే ఆయకట్టుగా ఎంపిక చేశారు. నీటి వినియోగ పద్ధతుల్ని అభివృద్ధి చేశారు.

ఆయకట్టుదారులందరూ కలిసి సమావేశమై ఒక నాయకుడ్ని ఎన్నుకుంటారు. ఆ నాయకుడ్ని పిన్నపెద్ద అంటారు. ఎంపిక కాబడిన వ్యక్తి సహజంగానే నిష్పక్షపాతిగా వుండి, నీటిపారుదల విషయంలో అందరికీ సమన్యాయం పాటించేవాడై వుంటాడు. ఈ పిన్నపెద్ద చెరువు కట్ట నిర్వహణకు, కాలువల నిర్వహణకు 'నీరుకట్టు'లను నియమిస్తాడు. ఒక్కొక్క నీరుకట్టుకు కొంత భాగాన్ని కేటాయిస్తాడు. ఈ నీరుకట్టు రాత్రింబవళ్ళు కాలువల్ని, తరి భూముల్ని గమనిస్తూ, వరుస ప్రకారం నీటిని వదులుతూ వుంటాడు. తూమునుంచి సాగే కాలువ కింద ఎన్ని ఎకరాల భూమికి నీటిని పారించవలసి వుందో నీరుకట్టుకు (నీరుగట్టి కూడా అంటారు) బాగా తెలిసి వుంటుంది. ప్రధాన కాలువ నుండి విడివడే ఉప కాలువల క్రింద, ఒక్కొక్క కాలువకింద ఎన్ని ఎకరాల భూమి వుందో ఆ దామాషా పద్ధతికింద నీటి కేటాయింపు జరిగేలా, వేళ్ళు, బెత్తళ్ళతో కొలతవేసి గట్టులను ఏర్పాటు చేస్తారు. ఈ కేటాయింపులను పంతము అంటారు. మళ్ళు చల్లిన తరువాత రైతుకేమీ బాధ్యత లేకుండా ఈ నీరుగంటే, పైర్లు కోతకొచ్చేంతవరకూ పైర్లు ఎండకుండా నీటిని పారిస్తుంటాడు. ఈ నీరుగంట్లు సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారో లేదోనని పిన్నపెద్ద గమనిస్తూ వుంటాడు. గ్రామ స్వయంవ్యవస్థలో భాగంగా ప్రజాస్వామ్యయుతంగా ఏర్పరచుకున్న ఈ కట్టుబాట్లకు ప్రజలే కర్తలు. చెరువుల మరమ్మతు సందర్భంలోగానీ, పూడికతీత సందర్భాలలో గానీ ప్రభుత్వాలు ధనసహాయం గావించేవి. పండిన పంటలో ఎకరాకు కొంత చెప్పున ధాన్యం కట్టుబడికి ఇవ్వాల్సి వుంటుంది. ఈ ధాన్యంతో చెరువుల నిర్వహణతోపాటు నీరుగట్టులకు జీవనభృతి ఇస్తారు.



కాలువలు పూడికలు తీసే సందర్భంలో ఇంటికి ఒకరు చొప్పున ఆ కాలువకింద ఎవరెవరి భూములుంటాయో వారందరూ పూడికతీత పూర్తయ్యేవరకూ హాజరుకావలసి వుంటుంది. ఎవరైనా రాలేకపోతే మామూలు దినకూలికంటే ఎక్కువగా జరిమానా వేస్తారు. దీనినే కుంటు అంటారు. ఈ కుంట్ల మూలంగా వసూలయిన సొమ్మంతా కాలువల అభివృద్ధికే వినియోగిస్తారు. ఇదే వ్యవస్థ ఊటకాలువలకు కూడా ఏర్పాటు చేసుకొనేవారు. పెన్నా, చిత్రావతి నదుల పొడవునా కొన్ని వందల ఊట కాలువలు తవ్వుకొని వ్యవసాయం చేశారు. మొత్తం వనరుల మీద ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రజల అధికారం, నిర్ణయాధికారం వుండేది. ప్రజలు వాటి అభివృద్ధిలోనూ, నిర్వహణలోనూ భాగస్వామ్యం వహించేవారు. ఏ కార్యక్రమం చేపట్టాలన్నా సమావేశాలను వేసి నిర్ణయం తీసుకునేవారు. ఈ సమావేశాలలోనే చెరువు తూములు ఎప్పుడు వదలాలి? ఎన్ని ఎకరాలలో పంట వేయాలని నిర్ణయాలు గైకొనేవారు. ఆయకట్టుదారులందరూ సమిష్టి నిర్ణయాలకు కట్టుబడి వుండేవారు. ఎవరైనా నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం పిన్నపెద్దకు వుండేది. పిన్నపెద్ద చర్యను అందరూ సమర్థిస్తారు. ఈవిధంగా ప్రతి చెరువుకు, ఊటకాలువకు ఒక సజీవమైన ప్రజా వ్యవస్థ వుండేది.

## సహజ నీటివనరుల వ్యవస్థ

**ఈ**నాడు అధికారికంగా లభ్యమయ్యే సమాచారం ప్రకారం జిల్లాలో దాదాపు 2000 సహజ నీటివనరులు ఉండేవి. వీటిలో చెరువులు, కుంటలు, ఊటకాలువలు, ఏటి కాలువలు అన్నీ వున్నాయి. ఇందులో మైనర్ ఇరిగేషన్ శాఖ 548 వనరుల నిర్వహణ బాధ్యత వహిస్తోంది. వీటికింద 60,910 హెక్టార్ల ఆయకట్టు వుంది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 1300 నీటి వనరులున్నాయి. వీటికింద ఆయకట్టు దాదాపు 12,000 హెక్టార్లు. ఇదికాక ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఎన్నో కుంటలు వున్నాయి. వీటిలో చిన్నవి - పెద్దవి కలిసి దాదాపు 3000 నుంచి 4000 వరకు వుండవచ్చునని అంచనా. రెవిన్యూ శాఖ లెక్కల ప్రకారం దాదాపు 2.20 లక్షల హెక్టార్లకు నీటివసతి సౌకర్యం వున్నట్లు తెలుస్తున్నది. వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

## సాగునీటి వనరులు

| | | సంఖ్య | ఆయకట్టు |
|---|---|---|---|
| 1. | మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో | | |
| | ఎ) చెరువులు | 330 | 39,155 హె. |
| | (ఆయకట్టు 100 ఎకరాలకు పైబడి ఉన్నవి) | | |
| | బి) ఊటకాలువలు, కాలువలు | 120 | 9,995 హె. |
| 2. | పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో | | |
| | చెరువులు, కుంటలు, కాలువలు | 1300 | 12,000 హె. |

ఇవన్నీ ఈనాటివి కావు. 12వ శతాబ్దం నుంచీ 16వ శతాబ్దం వరకూ స్థానిక పాలకులతో కలిసి ప్రజలు అభివృద్ధి చేసుకున్న సహజ వనరులు ఇవి. కాకతీయుల కాలం నుంచి బ్రిటిష్ వారి దాకా ఎందరో రాజుల ప్రత్యక్ష, పరోక్ష ఏలుబడికింద జిల్లా కొనసాగింది. ఒక్క విజయనగర రాజుల కాలంలో తప్ప, మిగతా కాలాల్లో తొందర తొందరగా రాజరికాలు మారినా, స్థానిక రైతాంగ వ్యవస్థ చెక్కుచెదరలేదు. ప్రకృతిని జయించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసిన చరిత్ర ఈ జిల్లా ప్రజలకుంది.

## సహజవనరుల పతనం

1792లో టిప్పుసుల్తాన్ ఈ ప్రాంతాన్ని నిజాంకు దత్తత గావించాడు. గుత్తి, తాడిపత్రి, తాడిమర్రి, యల్లనూరు, శింగనమల తాలూకాల్తో సహా (ఆనాటి తాలూకాలు) ఈ ప్రాంత మంతా నిజాం ఏలుబడిలోకి వచ్చింది. 1799 ఒప్పందం ప్రకారం ధర్మవరం, చెన్నంపల్లి, యాడికి, రాయదుర్గం ప్రాంతాలు కూడా నిజాం ఏలుబడిలోకి వెళ్ళిపోయాయి. నిజాం 1800లో బ్రిటిష్‌వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం దత్తమండలాలుగా ఈ జిల్లా పూర్తిగా బ్రిటిష్‌వారి ఏలుబడిలోకి వెళ్ళిపోయింది.

అంతవరకూ ఈ జిల్లా 80 మంది పాలెగాళ్ళ ఆధీనంలో వుండేది. అంతకుమునుపు వున్న ప్రభుత్వాలు ఏవీ ఈ పాలెగాళ్ళ వ్యవస్థను ఆటంకపర్చలేదు. కాని బ్రిటిష్ అధికారిగా బాధ్యతలు తీసుకున్న మన్రో మాత్రం పాలెగాళ్ళనందరినీ బాధ్యతల నుంచి తప్పించి నేరుగా ప్రభుత్వ అజమాయిషీలోకి తెచ్చాడు. సహజ వనరులన్నింటిమీదా ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఏర్పడింది. అడవులు, చెరువులు, కుంటలు, అన్నీ ప్రభుత్వ అజమాయిషీలోనికి వెళ్ళాయి. జిల్లానుంచి సంవత్సరానికి అరకోటి రెవిన్యూను నిర్ణయించారు. దీనినిబట్టే బ్రిటిష్ వారికి ఆదాయమే ప్రధానోద్దేశ్యం అనీ, ప్రజల స్థితిగతుల అభివృద్ధి కాదనేది అర్ధమవుతుంది.ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరిగిపోయింది. రాజ్యం విశాలం కావడం మూలంగా స్థానిక అవసరాలు, అవసరాలలో వైవిధ్యాలు పరిగణనలోనికి రాలేదు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలతో నిరంకుశంగా వ్యవహరించడంతో ప్రజలు సహజ వనరులతో సాన్నిహిత్యాన్ని కోల్పోయారు.

దేశంలో అప్పటివరకూ వున్న అనేక గ్రామీణ వ్యవస్థలు కూలిపోయినట్లే, వ్యవసాయ వ్యవస్థ కూడా కూలిపోయింది. సహజ నీటివనరులు తమవి కావు, ప్రభుత్వానివన్న భావన ప్రజలలో బలంగా నాటుకుని పోయింది. ఫలితంగా సహజ నీటి వనరులైన చెరువులు, ఊటకాలువలు క్షీణించాయి. ఎపుడయితే ప్రజల భాగస్వామ్యం లేకుండా పోయిందో అప్పుడే వాటి పతనం కూడా ప్రారంభమయింది.



## స్వాతంత్ర్యం తరువాత

బ్రిటీష్ ప్రభుత్వానికి ఆదాయమే ప్రధాన వ్యాపకం కాబట్టి సహజ నీటివనరుల సంరక్షణ బాధ్యత సక్రమంగా నిర్వర్తించలేకపోయిందని మనం భావించడం సహేతుకమే. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ప్రజాస్వామ్యయుతంగా మనల్ని మనం పరిపాలించుకునే అవకాశం వచ్చినప్పటికీ పరిస్థితుల క్షీణత కొనసాగిందే కాని మార్పు రాలేదు. కారణం బ్రిటీషువారు ఏ చట్టాల్ని అమలుపర్చారో, అవే చట్టాలు, విధానాలు మన పాలకులు కూడా అనుసరించడం వల్ల గ్రామీణ వ్యవస్థ పునరుజ్జీవనం పొందలేకపోయింది. గ్రామీణ వనరుల మీద ప్రజల భాగస్వామ్యం, నిర్ణయాధికారం వుండి తీరాలనే అభిప్రాయం ప్రభుత్వాలకు కలగలేదు. ఆ విధంగా బ్రిటీష్ ప్రభుత్వం నుంచీ నేటివరకూ సహజ నీటివనరుల క్షీణత అవిచ్ఛిన్నంగా కొనసాగింది.

## ప్రస్తుత పరిస్థితి

కొన్ని వందల సంవత్సరాలుగా ప్రజల భాగస్వామ్యంలో అభివృద్ధి పరచబడిన సహజ నీటి జీవవ్యవస్థలు ఈ విధంగా విచ్ఛిన్నమైతే ఆ వ్యవస్థల్ని పరిశీలించడం కానీ, అభివృద్ధి పర్చడం కానీ చేయకుండా ప్రభుత్వాలు వీటిని గాలికి వదిలివేశాయి. అంతవరకూ వున్నటువంటివాటిని అధ్యయనం చెయ్యకుండా, వాటి పునాదులుగా నూతన మార్పులను ప్రవేశ పెట్టకుండా, పాతవన్నీ అభివృద్ధి నిరోధకాలుగా భావించే ఒక కొత్త రాజకీయ బ్యూరోక్రాట్ల వర్గం అధికారాన్ని శాసించడం మొదలుపెట్టింది. గత యాభై సంవత్సరాలుగా ఈ వర్గమే పునాదులు లేని ఉపరితల అభివృద్ధి కట్టడాల్ని నిర్మిస్తూ వుంది. ఇక్కడ ఒక విషయం చెప్పడం అప్రస్తుతం కాదు. స్థానిక పాలెగాళ్ళ నుండి ఈ ప్రాంతాల్ని స్వాధీనం చేసుకున్న బ్రిటిష్ అధికారులు భిన్నమైన సంస్కృతి, భిన్నమైన సమాజం నుంచి వచ్చినవారు. ఇక్కడి ప్రజల ఆచారాలు, వ్యవహారాలు, వారి జీవన విధానం, వ్యవసాయం వారికి ఏమాత్రం అనుభవం లేనివి. వారికి ఆదాయం సమకూర్చుకోవడమే ప్రధాన ఉద్దేశ్యం. అయినా ఆ బ్రిటిష్ అధికారులే ఆదాయం పెంచుకోవడానికి వ్యవసాయం అభివృద్ధి చెందాలని భావించారు. ప్రతి చెరువును, దాని ఆయకట్టును పరిశీలించారు. థామస్ మన్రో గుర్రంమీద జిల్లాలోని నదుల వెంబడి ప్రయాణించి కొత్త చెరువులు, రిజర్వాయర్లు నిర్మించడానికి ఇక అవకాశమే లేదని, అంతకుముందే అన్నీ నిర్మించివేశారని పేర్కొన్నారు. మరికొంతమంది బ్రిటిష్ అధికారులు సాంకేతికంగా ఇవి అద్భుత పరిజ్ఞానంతో నిర్మించబడినాయని నివేదికల్లో పేర్కొన్నారు. మన పాలకులు వీటిమీద ఆపాటి శ్రద్ధ కూడా పెట్టలేదు.

మన వనరుల్ని మనమే అధ్యయనం చెయ్యలేని హ్రస్వదృష్టి మనల్ని వెంటాడుతోంది. చెరువులకు నీరందించే నీటిపారుదల మార్గాలు పూడిపోయాయి. కట్టుబడి వ్యవస్థలు అంత

రించిపోయాయి. చెరువులు, కుంటలు, బావుల ఆధారంగా ప్రజలు నిర్మించుకున్న సంస్కృతి, ఆచారాలు, జీవన విధానాలు అదృశ్యమయినాయి. అధికారుల - రాజకీయ నాయకుల దళారీ వ్యవస్థ అభివృద్ధి చెందింది. చిన్నచిన్న చెరువులు, కుంటలు అన్యాక్రాంతమయిపోయాయి. చాలాచోట్ల లక్షణంగా పట్టాలు కూడా ఇచ్చేశారు. మరమ్మతులకు, ఆలనాపాలనకూ నోచుకోక చెరువు కట్టలు బలహీనపడి, కొద్దిగా నీరువస్తేనే తెగిపోవడం జరుగుతూ వుంది. కాంట్రాక్టర్లు, అధికారుల చలవతో మరమ్మతు చేసిన ప్రదేశంలోనే మరుసటి సంవత్సరం చెరువులు తెగిపోవడం మనం సాధిస్తున్న అభివృద్ధికి కలికితురాయి. చెరువుల్లో, కుంటల్లో నీరు నిలువ చేసుకునే సామర్థ్యం తగ్గిపోవడంతో భూగర్భ జలాలు రీచార్జి అయ్యే ప్రక్రియ కూడా మందగించింది.

ఫలితంగా భూగర్భ జలమట్టం పాతాళానికి వెళ్ళిపోతుండడం, దాని వల్ల ఫ్లోరైడ్ సమస్య పెరగడం మనం గమనిస్తున్న విషయాలు. ప్రతి సంవత్సరం దాదాపు 40 టియంసిల నీరు వృధాగా సముద్రంలోకి పోతున్నట్లు అంచనా.

## నీటివనరుల పునరుజ్జీవనం తక్షణ అవసరం

ఒక్కో ప్రాంతంలో కొన్ని చెరువులు, వాటిమధ్య కుంటలు, నీటిపరీవాహక మార్గాలు కలిసి ఒక జీవ వ్యవస్థగా ఏర్పడి వున్నాయి. ఇవి వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యంగానే కాకుండా, పశువులకు, పక్షులకు, జంతువులకు తాగునీటి సౌకర్యంగా కూడా ఉపయోగపడేవి. చిన్నచిన్న కుంటలు ఊటచెరువులుగా ఉపయోగపడేవి. ఫలితంగా భూగర్భ జలాలు రీచార్జి అవడమే కాకుండా భూమి ఏటవాలుగా వున్న చోట కూడా భూమి కోతకు గురి కాకుండా ఉపయోగకరంగా వుండేది. ఈ వ్యవస్థను పునరుద్ధరించడమంటే కేవలం చెరువు కట్టల్ని పునర్నిర్మించడమే కాదు. ఆ చెరువు ఏ పరీవాహక వ్యవస్థలో భాగంగా వున్నదో, ఆ నీటి పరీవాహక మార్గాలతో సహా, వాటిలో భాగంగా ఉన్న చెరువులు, కుంటలు అన్నిటినీ పునరుద్ధరించాలి. కుంటలను నీటి నిలువ కుంటలు (Percolation Kunta)గా మార్చాలి. ఈ చెరువులు, కుంటలు కలిగిన నీటిపారుదల వ్యవస్థలో ఏ గ్రామాలు వుంటాయో ఆ గ్రామాలకు చెందిన ప్రజలకు వీటి నిర్వహణ - నిర్ణయాధికార బాధ్యతలను అప్పగించాలి. అవసరమైన చోటల్లా చెరువుల్లో, కాలువల్లో పూడికలు తీయించి, నీటిపారుదల వ్యవస్థను సజీవం చేయాలి. దీనిద్వారా కొన్ని వందల కోట్ల రూపాయల విలువైన ప్రజల ఆస్తిని మళ్లీ ప్రజల పరం, ప్రకృతిపరం చేసినట్టవుతుంది. బయట ప్రాంతాల నుంచి నీటి సరఫరా కావాలనే డిమాండు 50 సంవత్సరాల తరువాత కూడా డిమాండుగానే మిగిలిపోయిన పరిస్థితులలో సహజ నీటివనరుల పునరుద్ధరణ ఒక్కటే జిల్లా ప్రజలకు అందుబాటులో వున్న ప్రత్యామ్నాయం.



### ఏ చెరువు ఎప్పుడు కట్టారు..

| సంఖ్య | చెరువు / కాలువ | కట్టించినవారి పేరు | సంవత్సరం |
|---|---|---|---|
| 1. | కుందిర్పి చెరువు | చిక్కబొమ్మనాయక | 1340 |
| 2. | ధర్మవరం చెరువు | క్రియాశక్తి ఒడయార్ | 14వ శతాబ్దం |
| 3. | గొట్టూరు చెరువు | ,, | ,, |
| 4. | కావుల చెరువు | ,, | ,, |
| 5. | చెన్నరాయపట్టణ (రిజర్వాయరు) | అనంత (S/o.బుక్క) | ,, |
| 6. | బుక్కరాయసముద్రం చెరువు | చిక్కఒడయార్ | 1364 |
| 7. | బుక్కపట్నం చెరువు | ,, | ,, |
| 8. | తాళ్ళపల్లి చెరువు | జల్లెల రమణరాజు | 14వ శతాబ్దం |
| 9. | హోరవి చెరువు | బుక్కరాయలు (మరమ్మతు) | 1383 |
| 10. | ముదిరెడ్డిపల్లి చెరువు | పెద్దబైరారాజు | 1386 |
| 11. | చిన్నకోట్ల కాలువ | ఇరుగప్పగడ నాయక | 1396 |
| 12. | చి.పల్లి చెరువు | గజపతి యువరాజు | 1478 |
| 13. | రామాపురం చెరువు | నరసింహ సోమయాజి | 1493 |
| 14. | ఉరవకొండ చెరువు | ఇతరులు | 1493 |
| 15. | కొనకొండ్ల చెరువు | అమరాద తిమ్మరుసు | 1517 |
| 16. | నగరిగేరి - తాళ్ళపరిగె కాలువ | మహాజనులు | 1537 |
| 17. | బూదిలి కాలువ | చిక్కవరపమ్మ (మరమ్మతు) | 1537 |
| 18. | బూదిలి చెరువు | ,, | 1537 |
| 19. | లేపాక్షి చెరువు | మహాజనులు | 1538 |
| 20. | లేపాక్షి చెరువు | ,, | 1538 |
| 21. | మోదయ - ఊట కాలువ | వీరనాయక | 1538 |
| 22. | తుమ్మదహల్లి చెరువు | చెన్నెగౌడ, తుమ్మెగౌడ (మరమ్మతు) | 1541 |
| 23. | తొండపాడు బావి | గుడి ధర్మకర్తలు | 1542 |
| 24. | చాలకూరు (పెద్దకుంట) | మల్లిగౌడు, కారుగౌడు | 1551 |
| 25. | బాగినాయకునిపల్లి చెరువు | రామరాయదేవ (మరమ్మతు) | 1556 |

| తెగిపోయిన కొన్ని ముఖ్యమైన చెరువులు (మీడియం ఇరిగేషన్ అధీనంలోనివి) | | | |
|---|---|---|---|
| సంఖ్య చెరువు/గ్రామం పేరు | తెగిపోయిన తేది | ఆయకట్టు | మండలం |
| 1. మల్లికేతి | 17.10.94 | 457 | డి.హీరేహాల్ |
| 2. గుడిసెలపల్లి | 3.6.92 | 180 | డి.హీరేహాల్ |
| 3. కలేకుర్తి | 14.6.96 | 367 | కణేకల్లు |
| 4. అప్పేచెర్ల | 12.7.89 | 204 | పెద్దవడుగూరు |
| 5. నిట్టూరు | 23.7.89 | 620 | యాడికి |
| 6. వెంకటాంపల్లి | 11.7.88 | 340 | తాడిపత్రి |
| 7. యల్లనూరు | 22.7.88 | 1087 | యల్లనూరు |
| 8. చెన్నంపల్లి | జూన్, 1989 | 157 | బుక్కరాయసముద్రం |
| 9. ముదినాయనిపల్లి | 20.10.96 | 108 | కళ్యాణదుర్గం |
| 10. బ్రహ్మసముద్రం | 26.8.96 | 287 | బ్రహ్మసముద్రం |
| 11. ఎరడికెర | 15.6.96 | 190 | బ్రహ్మసముద్రం |
| 12. సంతేకొండాపురం | 6.6.98 | 190 | బ్రహ్మసముద్రం |
| 13. యాటకల్లు | 20.10.96 | 143 | కంబదూరు |
| 14. కంబదూరు | 19.10.96 | 1033 | కంబదూరు |
| 15. పల్లూరు కొత్తచెర్వు | 20.10.96 | 131 | కంబదూరు |
| 16. రాళ్ళ అనంతపురం | 20.10.96 | 306 | కంబదూరు |
| 17. బద్దలాపురం ఊరిపడమర చెరువు | 17.6.96 | 114 | కనగానిపల్లి |
| 18. నల్లకుంట (తూముచెర్ల) | 20.10.96 | 174 | కనగానిపల్లి |
| 19. విద్యారణ్యస్వామి చెరువు, గంటిచెరువు | 9.9.96 | 200 | రామగరి |
| 20. మైలేపల్లి విరుపాపురంచెరువు | 27.9.96 | 238 | కొత్తచెర్వు |
| 21. కొండారెడ్డి చెరువు | -- | 490 | తలుపుల |
| 22. చాగలేరు | -- | 126 | చిలమత్తూరు |
| 23. కమ్మవారిపల్లి | 14.6.96 | 139 | గోరంట్ల |
| 24. తుంగోడు | అక్టోబర్, 96 | 180 | సోమందేపల్లి |
| 25. చల్లపల్లి | 30.8.93 | 532 | సోమందేపల్లి |
| 26. ఉప్పిడిపల్లి | 27.5.96 | 146 | మడకశిర |
| 27. చెరుకూరు | 10.9.97 | 231 | రొద్దం |
| | **మొత్తం** | **9,026** | (ఫిబ్రవరి, 2000) |



# కరువు దిగ్బంధంలో రైతాంగం

**2000** సంవత్సరం ఏప్రిల్ నెలలో జిల్లాలో పర్యటించిన అధ్యయన కమిటీ నివేదిక:

## విత్తలపల్లి మండలం

ఈ మండలంలో అప్పరాచెర్వు, రాఘవంపల్లి, సంజీవపురం, గుమ్మళ్ళకుంట గ్రామాల రైతుల్ని పరామర్శించాము. అప్పరాచెర్వు గ్రామంలో కరువు పనుల కింద 35 వేల రూపాయల ఖర్చుతో రోడ్డును అభివృద్ధిపర్చడం కింద పనులు మంజూరు చేశారు. కరువు పరిస్థితులలో పనిలేని వారికి పనులు కల్పించడం ముఖ్య ఉద్దేశ్యమయితే ఇక్కడ ప్రొక్లేన్‌తో మట్టిపని కావించారు. ఈ రోడ్డు కరువు పనుల్లో భాగంగా చేపట్టినట్టు కూడా గ్రామ ప్రజలకు తెలియదు. అధికారుల, కాంట్రాక్టర్ల 'కరువు' తీర్చడానికే పని చేపట్టినట్టుగా ఉంది. ఈ గ్రామానికి చెరువుంది కాని నిండడం లేదు. పోయినసారి పంటల వైఫల్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. గ్రామంలో వ్యవసాయ పనులు లేవు. ఈసారి వర్షాలు పడితే, విత్తడానికి ఎవరివద్దా శెనక్కాయలు కూడా లేవు. ఇంకా పంట నష్టపరిహారం అందలేదు. పంట నష్టపరిహారం లేకపోతే మానె, సబ్సిడీ ఇవ్వకపోతే మానె, కనీసం మార్కెటు ధరకు అయినా ప్రభుత్వం శెనక్కాయల విత్తనాల్ని సరఫరా చేయాలని ఆదినారాయణరెడ్డి అనే రైతు కోరారు. గ్రామంలోని వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనులు లేక ధర్మవరం వెళ్ళి ఇటుక బట్టీలలోనో, కట్టడపు పనిలోనో పనిచేస్తున్నట్టు చెప్పారు. అప్పరాచెర్వు గ్రామంలోని చెర్వుకు నీళ్లు లేకపోయినా, కనీసం ధర్మవరం చెర్వుకు నీళ్ళు వచ్చినా ఎంతోకొంత జీవనాధారం ఏర్పడుతుందని గ్రామస్థులు చెప్పారు. రాఘవంపల్లి, సంజీవపురం, గుమ్మళ్ళకుంట గ్రామాల రైతులు కరెంటు కోత కూడా తీవ్రమైన సమస్యగా ఉందని చెప్పారు. కరెంటు ఎపుడు వస్తుందో తెలిడంలేదన్నారు. అంతో ఇంతో పంట బావుల్లో నీరు ఊరి, బావులకింద వేసుకున్న ఎకరా, రెండెరాల పంటలకు కూడా కరెంటు సమస్య వల్ల నీరు పారించలేక పోతున్నట్లు, కొన్నిచోట్ల పంటలు ఎండిపోయినట్లు రైతులు చెప్పారు. కరెంటుకు సంబంధించిన మరొక సమస్య ఏమిటంటే, ఒకే బావిలో రైతులకు పొత్తు

వుంటుంది. ఒక్కో రైతుకు ఒక్కో మోటారు, మోటారుతోపాటు మీటరు వుంటుంది. వంతుల ప్రకారం నీరు పారపెట్టుకోవాలి. రైతు వంతు వచ్చినప్పుడు ఏదైనా కారణం వల్ల కరెంటు రాకపోతే, మళ్ళీ వంతు వచ్చేవరకూ నీరు పారపెట్టేందుకు అతనికి అవకాశం వుండదు. పంట ఎండిపోతుంది. రైతుల మధ్య తగాదాలు, వైషమ్యాలు పొడసూపుతాయి. మరొక సమస్య ఏమిటంటే, కొన్నిచోట్ల కొంతమందికి 4-5 బావులున్నాయి. కాని ఆ బావులన్నీ ఎండిపోవడం వల్ల వాళ్లు పంటలు వేయడం లేదు. అయితే వర్షాలు రాక పోతాయా, బావుల్లోకి నీరు రాక పోతుందా అనే ఆశతో కరెంటు కనీస చార్జీలు మాత్రం కడుతుంటారు. రైతుకు ఇదొక భారం. కరువు జిల్లాగా ప్రకటించినారు కాబట్టి కరువు రోజుల్లో కరెంటు చార్జీలు మాఫీచేయాలని రైతులు కోరుతున్నారు. వాడని కరెంటుకు కూడా కనీస చార్జీల రూపేణా రైతుల నుంచి వసూలు చేయడం అన్యాయం కదా.

మండలంలో వ్యవసాయ కూలీలు కొంతమంది ఈవరకే వలసపొయ్యారు. గత 5-6 సంవత్సరాలుగా చాలామందే పట్టణ ప్రాంతాలకు వలసపోతూ ఉండడం వల్ల, ఈసారి మాత్రమే వలస పోయినట్లు అనిపించదు. పశువులు ఎక్కడో తప్ప కనిపించవు. రైతుల ఇళ్ళల్లో ఎద్దులు, పాడి పశువులు తప్ప, మిగతా చిన్న పశువులు కనిపించవు. గత 10 సంవత్సరాలుగా పశువుల అమ్మకం పరంపర కొనసాగుతూనే వుంది. మండలంలో ఏ రైతు దగ్గరా వేరుశెనక్కాయలు లేవు. ప్రభుత్వం ఇస్తుందో లేదో తెలియదు. ఈ ఏడన్నా వర్షం సకాలంలో కురుస్తుందో లేదో తెలియదు. ఏరకమైన ఆలోచనా లేకుండా రైతులు నిస్తేజంగా, నిశ్శబ్దంగా వుంటున్నట్లు అర్థం అవుతూంది. గ్రామాలలో ఒక అసాధారణ నిశ్శబ్దం తాండవిస్తూ వుంది.

## తాడిమర్రి మండలం

ఈ మండలంలో తాడిమర్రి గ్రామం, నిడిగల్లు, మేడిమేకలపల్లి, నరిసినేపల్లి గ్రామాలు సందర్శించాము. తాడిమర్రి గ్రామంలో బి.సి. కాలనీలో, ఎస్.సి. కాలనీలో కరువు పనులుగా ప్రభుత్వం ప్రకటించిన రోడ్లు గమనించాము. కేవలం చిన్నపాటి మందంతో మట్టి పూత వేశారు. ప్రజలకెవరికీ ఇవి కరువు పనుల్లో భాగంగా జరిగినాయని తెలియదు. కాంట్రాక్టు పద్ధతిలో జరిగాయి. రైతులు వేరుశెనగ గురించి చాలా ఆందోళనగా వున్నారు. కరెంటు సమస్య వల్ల రెండు బి.సి. కాలనీల్లో నీళ్ళు రావడం లేదు. ఒక బి.సి. కాలనీలో స్త్రీలకు మరుగుదొడ్డి సమస్య చాలా తీవ్రంగా వుంది.

మేడిమేకలపల్లి గ్రామంలో దళితులకు గృహవసతి లేదు. ఊరికి దూరంగా కొన్ని కుటుం బాలు ఇంకా మట్టి ఇళ్ళలో నివసిస్తున్నారు. ఈ గ్రామంలో కూడా బోరు చెడిపోవడం వల్ల నీటి సమస్య తీవ్రంగా వుంది.



నిడిగల్లు గ్రామంలో కరువు పనుల కింద చేపట్టిన రోడ్డును కూడా ప్రొక్లైయిన్‌తోనే వేశారు. ఎవరికీ పనులు కల్పించలేదు. పంటలు పండక ఈసారి కూడా సకాలంలో వర్షాలు రాకపోతే గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని, ఒకవేళ వర్షం వస్తే విత్తడానికి వేరుశెనగ విత్తనాలు లేవని, ఎలాగైనా ప్రభుత్వం నుంచి వేరుశెనగ విత్తనాలు వచ్చేట్లు చేయమని హనుమంతు అనే బి.సి. రైతు, ఓబుళప్ప అనే దళిత రైతు కోరారు. ఈ గ్రామానికి వాటర్‌షెడ్ మంజూరు అయినా, గ్రామస్థుల మధ్య పోటీ వల్ల వాటర్‌షెడ్ రాలేదని ఆవేదన వెలిబుచ్చారు. నరిసినేపల్లి గ్రామం పరిస్థితి కూడా భిన్నంగా లేదు. రైతులందరికీ ప్రస్తుత సమస్య వేరుశెనగ విత్తనం. ఈ మండలంలో వేరుశెనగ మంచి దిగుబడి వస్తుంది. భూములు మంచి సారవంతమైన భూములు. రైతులు చాలా కష్టించి పనిచేస్తారు. సరిఅయిన అదునులో వర్షం కురిస్తే,వేరుశెనగ మంచి దిగుబడి వస్తుంది. అయితే వర్షాలు రాక, వచ్చినా తెగుళ్ళతో పంటలు పూర్తిగా పాడవడం వల్ల రైతులు భారీగా నష్టపోయారు. గత 7-8 సంవత్సరాలుగా ఈ మండలంలో ఎర్రగొంగడి పురుగు వల్ల పంట నష్టం అవుతూనే వుంది. పశువులకు మేత లేదు. బావులలో నీరు లేదు. ఉన్న కొద్దిపాటి నీటితో ఎకరా, అర్ధెకరా సాగు చేస్తే కరెంటు ఎప్పుడొస్తుందో తెలియకపోవడం, తక్కువ ఓల్టేజితో అప్పుడప్పుడు మోటార్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతూ వుంది. రైతులు వేరుశెనగ సబ్సిడీ కోరుకోవడం లేదుకానీ, పూర్తి ధరకే కావలసినంత సరఫరా చేయాలని మాత్రం కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వాధికారులు గ్రామాల్ని సందర్శించి వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు వారిని పరామర్శించిన పాపాన కూడా పోలేదు.

## ధర్మవరం మండలం

ధర్మవరం మండలంలో దర్శిమల, నడిమిగడ్డపల్లి, రేగాటిపల్లి, పోతులకుంట, బిల్వం పల్లి, బుద్దారెడ్డిపల్లి, నేలకోటతండా, నేలకోట, ఏలుకుంట్ల గ్రామాల ప్రజలను పరామర్శించడం జరిగింది. దర్శిమల గ్రామంలో మిట్టమధ్యాహ్నం 1.30 గంటలకు దాదాపు రెండు కి.మీ. దూరం నుంచి మహిళలు నెత్తిమీద కడవలు తెస్తూ కనిపించారు. ఈ గ్రామానికి సత్యసాయి నీటి పథకం లేదని గ్రామస్థులు చెప్పారు. ఉన్న ఒక్క బోరు చెడిపోవడంతో గ్రామంలో వున్న మంచినీటి పథకం పనిచేయడం లేదు. పశువులు, మనుషులు తాగడానికి దూరం నుంచే నీరు మోయాల్సి వస్తున్నదని మహిళలు వాపోయారు. ఈ గ్రామానికి ఒక చిన్నచెరువు వుంది. కాని ఆ చెరువును పర్కొలేషన్ చెరువుగా మార్చి కింది భాగంలోని ఆయకట్టులో బోర్ల ద్వారా వ్యవసాయం చేస్తున్నట్టు చెప్పారు. చెరువులోకి నీళ్ళు రావడం లేదు కాబట్టి బోర్లు పనిచేయవు. ఈ గ్రామం బాగా మారుమూల ప్రాంతంలో ఉన్నందువల్ల

వైద్య సదుపాయానికి ధర్మవరం వెళ్ళాల్సి వస్తుందని గ్రామస్థులు చెప్పారు. ఈ గ్రామం చుట్టూ కొండ గుట్టలు వుండడం మూలంగా మెట్టభూముల విస్తీర్ణం తక్కువ. వేరుశెనగ విత్తన సమస్య వీరిని కూడా వెంటాడుతూ వుంది. రేగాటిపల్లి, పోతులకుంట గ్రామ రైతుల పరిస్థితి కూడా చాలా దయనీయంగా వుంది. విత్తనసమస్యతో కంటిమీద కునుకు రావడం లేదని చెప్పారు.

బిల్వంపల్లి గ్రామానికి వాటర్‌షెడ్ మంజూరయినట్టు వార్తాపత్రికల ద్వారా ప్రజలు గమనించారట. కానీ తమకేమీ తెలియదని చెప్పారు. ఈ గ్రామానికి సంబంధించిన భూములు కొండ, గుట్ట చెరియల్లో వుండడం మూలాన, భూములు బాగా కోతకు గురై నిస్సార భూములుగా మారిపోయినట్టు గమనించాము. ఈ గ్రామాలు మారుమూల గ్రామాలు కావడం మూలంగా అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలకు దూరంగా వుంటున్నాయి. వర్షాలు సరిగా వచ్చినా, ఈ భూముల్లో ఫలసాయం అంతంతమాత్రంగానే వుంటుంది.

నేలకోటతండాలోని చాలామంది ఇతర ప్రాంతాలకు వలస పోయినట్లు రామస్వామి నాయక్, దుబ్‌లా నాయక్ అనే గ్రామస్తులు చెప్పారు. నేలకోట, ఏలుకుంట పరిస్థితి కూడా ఇంతే. గ్రామాల్లో పనిపాటలు లేవు. పంటకు విత్తనాలు లేవు.

## ముదిగుబ్బ మండలం

ముదిగుబ్బ మండలంలో ముదిగుబ్బ, నాగులగుబ్బల, దొరిగల్లు, నక్కలపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్ని పరిశీలించడం జరిగింది. ఈ మండలంలో ఇతర ప్రాంతాలకంటె మెరుగ్గా 30 శాతం పంట దిగుబడి వచ్చినట్లు దొరిగల్లు గ్రామస్తులు చెప్పారు. నక్కలపల్లి గ్రామంలో మంచినీటి వసతి లేదు. రైతులు ఎవరివద్దా విత్తనం కాయలు లేవు. పండిన 30 శాతం పంటలో గింజ గట్టిపడకపోవడం వల్ల ఈసారి విత్తనానికి పనికిరావని రైతులు చెప్పారు. సబ్సిడీ లేకపోయినా ప్రభుత్వం కనీసం మంచిరకం వేరుశెనగ విత్తనాలు సరఫరా చేయాలని కోరారు.

బాగా సారవంతమైన ఎర్రనేలలు పచ్చదనం లేక నిస్సారంగా కనపడుతున్నాయి. ఎక్కడా పశువుల జాడ కనబడదు. బీడు భూముల్లో పశువుల మందలు కనపడి తీరాలి. అయితే గత 7-8 సంవత్సరాలుగా గోరంట్లకు పశువులు అమ్ముకుంటూ వుండడం వల్ల పశువులనేవి గ్రామాల్లో లేకుండా పోయాయి.

## బుక్కపట్నం మండలం

బుక్కపట్నం మండలంలో గూనిపల్లె, సిద్ధరాంపురం, మారాల, గసికవారిపల్లె గ్రామాల రైతులను పరామర్శించడం జరిగింది. మారాల గ్రామంలోని రైతులు కూడా వేరుశెనగ విత్తనాన్నే తక్షణ సమస్యగా చెప్పారు. గసికవారిపల్లె చాలా పెద్ద పంచాయతీ. వ్యవసాయం



పూర్తిగా మానివేస్తేనే బతగ్గలం అని కొందరు రైతులు చెప్పారు. ఓబులేసు, క్రిష్ణారెడ్డి అనే రైతులు ఈసారి కూడా పంటలు పండకపోతే భూములు బీళ్ళుపెట్టి ఎక్కడికైనా వలసవెళ్ళి బతకడం మంచిదని చెప్పారు. రైతులు చాలా నిర్లిప్తతతో వున్నారు. వర్షాలు వస్తాయో రావో తెలియదు. వచ్చినా వేరుశెనగ విత్తనం దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితులలో వున్నారు. వ్యవసాయ పనులు లేనికాలంలో మొత్తం జనాభా గ్రామంలో వుండాల్సింది. అయితే జనసంఖ్య చాలా పలుచగా వుంది. చాలామంది యువకులు, వ్యవసాయ కూలీలు ఉపాధి వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్ళినట్టుంది. యువకులు అనబడేవాళ్ళు రైతు కుటుంబాలకు చెందినవారు కావచ్చు, వ్యవసాయ కూలీల కుటుంబాలకు చెందినవారు కావచ్చు... గ్రామంలో వుండే పరిస్థితి లేదు.

గూనిపల్లి గ్రామంలో రాజశేఖరరెడ్డి, వెంకటరెడ్డి, హనుమంతరెడ్డి, తదితరులు మాట్లాడుతూ వ్యవసాయానికి చాలా నిరాశాజనకమైన పరిస్థితి వున్నట్లుగా చెప్పారు. ఒక వేళ వేరుశెనగ పంట బాగా దిగుబడి వచ్చినా, ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినట్లుగా చెప్పారు. రసాయనిక ఎరువుల ధరలు, క్రిమిసంహారక మందుల వల్ల పెట్టుబడులు బాగా అవసరమౌతాయి. పంట దిగుబడి వస్తే నష్టంలేదుకానీ, పంట దిగుబడి తగ్గితే మాత్రం పూర్తిగా నష్టం వస్తుందని లెక్కలువేసి చెప్పారు. భూమిలో తేమ తక్కువగా వుండడం వల్ల ఇతర పంటలు కూడా సరిగా పండవని చెప్పారు. గ్రామంలో దాదాపు 200 ఎకరాల పొలంలో మెట్టసాగు, పండ్ల మొక్కలు నాటినట్టుగా చెప్పారు. బావులలో నీరు లేకపోవడం, ఉన్నవాటిని తోడడానికి కరెంటు నమ్మకం లేకపోవడం రైతుల్ని నట్టేట ముంచుతున్నట్లుగా వివరించారు.

సిద్ధరాంపురంలో రైతు, రైతుసంఘం మాజీ నాయకుడు ఓబిరెడ్డి గారిని కలవడం జరిగింది. బయట ప్రాంతాలనుంచి నీరు తెచ్చి కనీసం చెరువులు నింపగలిగితే మనుషులు, పశువులకు తాగునీటితోపాటు, కొంచెం ఉపాధి దొరికే అవకాశం వుంటుందని సూచించారు. పూర్తిపంట పండినా వ్యవసాయంలో గిట్టుబాటు కావడం లేదని, అలాంటిది అరకొర పంటలు పండితే రైతు పూర్తిగా నష్టాల ఊబిలో కూరుకుపోవాల్సి వుంటుందని చెప్పారు.

## కొత్తచెర్వు మండలం

కొత్తచెర్వు మండలంలో కె.లోచర్ల, లింగారెడ్డిపల్లి, కనిపెట్టిపల్లి, మైలేపల్లి, కొడవగానిపల్లి, కేశాపురం గ్రామాలలోని రైతులు, వ్యవసాయ కూలీల అభిప్రాయాల్ని తెలుసుకోవడం జరిగింది. కె.లోచర్ల గ్రామంలో కేశవరెడ్డి, శ్రీమతి సరస్వతి గారు మాట్లాడుతూ మునుపటి సంవత్సరం కంటే ఈసారి కరువు తీవ్రత ఎక్కువగా వుందని తెలిపారు. గ్రామంలో కరువు నిధుల కింద చేపట్టిన రోడ్డును గురించి గ్రామంలో ప్రజలకెవ్వరికీ తెలియదు. కాంట్రాక్టరు

ప్రొక్లెయిన్‌తో మట్టిపని చేయించినట్లు చెప్పారు. వేరుశెనగ విత్తనం గురించే రైతులందరికీ దిగులుగా వుంది.

లింగారెడ్డిపల్లిలో కరువు నిధులతో చేపట్టిన మట్టి రోడ్డు పని చూడడం జరిగింది. ఈ రోడ్డు పని కూడా పూర్తిగా ప్రొక్లెయిన్‌తోనే చేశారు. వ్యవసాయ కూలీలెవరికీ పని లభించడం లేదు. వెంకటరామిరెడ్డి అనే రైతు వ్యవసాయం మీద మక్కువతో మిలటరీ ఉద్యోగాల్ని వదిలి పెట్టి వచ్చాడట. వ్యవసాయం చాలా దుర్భరంగా వుందని చెప్పాడు. వెంకటరెడ్డి, చెంద్రాయుడు, శివారెడ్డి అనే రైతులు కూడా బావులన్నీ ఎండిపోయినట్లుగా చెప్పారు. బుక్కపట్నం చెరువుకు నీళ్ళు మళ్ళిస్తే, భవిష్యత్తులో గ్రామాలు నివాసయోగ్యంగా వుంటాయని చెప్పారు.

కనిశెట్టిపల్లి గ్రామంలో కుళ్ళాయప్ప, రవీంద్ర అనే రైతులు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 60 పంట బావులున్నట్లు, వాటిలో కేవలం ఆరు బావుల్లోనే కొద్దో, గొప్పో నీరు ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం సమకూర్చిన నీటి పథకంలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా వుందని, పశువులు సైతం తాగడానికి ఇష్టపడటంలేదని చెప్పారు. సత్యసాయి పథకం వున్నా 6-7 రోజులకొకసారి మాత్రమే నీరు వస్తున్నట్లుగా చెన్నక్రిష్ణ, మహబూబ్ బాషా అనే గ్రామస్తులు చెప్పారు. కరువు నిధులతో వేసిన మట్టిరోడ్లను ప్రొక్లెయిన్‌తో వేసినట్లు చెప్పారు.

మైలేపల్లిలో కరువు నిధులతో వేసిన రోడ్డుకు మాత్రం కాంట్రాక్టరు మనుషుల్ని ఉపయోగించినట్లు చెప్పారు. మైలేపల్లిలో బయపరెడ్డి మాట్లాడుతూ పాలవ్యాపారం చేస్తున్నాను కాబట్టి రెండు పూటలా తిండి తింటున్నట్లు చెప్పారు. చెనిక్కాయ వేసుకొని అప్పుల్లో మునిగిపోవడం కంటే, కందులు, ఆముదాల పంట తక్కువ రాబడి వచ్చినా నష్టముండదని సూచించాడు. కొడవగానిపల్లిలోని లక్ష్మినారాయణ, లక్ష్మన్న, ముత్యాలు, అక్కన్న మాట్లాడుతూ తమ గ్రామంలో ఎక్కువభాగం ఎరుకలు వుంటున్నట్లుగా చెప్పారు. ప్రభుత్వ సహాయం తమకేమీ లభించడంలేదని చెప్పారు. కేశవయ్య, శివానంద, పెద్దబయప్ప, గఫూర్ అనే గ్రామస్తులు ఏటికాలువ మరమ్మతు గావిస్తే లింగదాసరి కుంట అనే కుంటకు నీళ్లు వస్తాయని, దాదాపు 300 ఎకరాల దాకా నీరు పారుతుందని చెప్పారు. బుక్కపట్నం చెరువు నిండితే గ్రామాలన్నీ బాగుపడతాయని కూడా చెప్పారు.

(ఏప్రిల్, 2000)



# వేరుశెనగ సంక్షోభానికి కారకులెవరు?

**2000**-2001 ఖరీఫ్‌లో వేరుశెనగకు మొవ్వకుళ్ళు తెగులుసోకడం అనంతపురం జిల్లా రైతాంగాన్ని ఒక్క కుదుపు కుదిపింది. పంట చేతికొస్తుందనుకున్న సమయంలో మొవ్వకుళ్ళు తెగులు వేరుశనగ పంటపై దావానలంలా వ్యాపించడంతో రైతులు బెంబేలెత్తి పోయారు. ఒక్క నెలలోనే 58 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇటువంటి ఉత్పాతాలు అనంత రైతుకు కొత్త కావు. జిల్లా భౌగోళిక పరిస్థితుల అననుకూలత వల్ల రైతులు ప్రకృతితో పోరాడుతూనే వున్నారు. వర్షాభావం, నిత్య కరువులు, రైతును నిరంతరం ఇబ్బంది పెడుతూనే ఉన్నా వేరుశెనగ పంట ఒక్కటే రైతును ఇన్నాళ్ళూ బతికిస్తూ వచ్చింది. ఈ పంట కూడా సంక్షోభంలో పడిందంటే అనంతపురం జిల్లా వ్యవసాయమే సంక్షోభంలో పడినట్లు లెక్క. ఎందుకంటే అనంతపురం వ్యవసాయమంటేనే వేరుశెనగ పంట. రాష్ట్రం మొత్తంమీద 12-13 లక్షల హెక్టార్లలో వేరుశెనగ సాగవుతూ వుంటే, ఒక్క అనంతపురం జిల్లాలోనే 8 లక్షల హెక్టర్ల దాకా సాగవుతూ వుంది. జిల్లాలో మొత్తం సాగవుతున్న భూమి 9.23 లక్షల హెక్టార్లు అయితే అందులో వేరుశనగదే 90 శాతం.

ఈ సంక్షోభంలో నుంచి అనంత రైతును బయటపడవేసే దిశగా ప్రభుత్వం, శాస్త్రవేత్తలు కృషిచేసే బదులు నలుగురు గుడ్డివాళ్ళు ఏనుగును వర్ణించిన రీతిలో వేరుశెనగ సంక్షోభానికి కారణాలు చూపుతున్నారు. వేరుశెనగ పంట ఎంతమాత్రం పనికి రాదని కొందరు వాదిస్తే, మరికొందరు ఒక అడుగు ముందుకువేసి వేరుశెనగ పంటనే నిషేధించాలని సూచిస్తున్నారు. వీరిలో ప్రభుత్వం దగ్గర జీతం తీసుకునే శాస్త్రవేత్తలు కొంతమందయితే, స్వచ్ఛంద సంస్థలలో పనిచేస్తూ ఉచిత రీతిన ప్రభుత్వానికి సేవచేసేవారు మరికొందరు. వీరందరూ ఈ సంక్షోభానికి రైతే కారకుడని వేలెత్తి చూపుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 'దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు' డబ్ల్యు.టి.ఓ. వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారాలు సూచించవలసిందిగా కొంతమంది నిపుణులతో ఒక కమిటీ వేసింది. అనంత

పురం జిల్లాను కాగితాల్లో, ప్రభుత్వ నివేదికల్లో మాత్రమే పరిశీలించే ఒక వ్యవసాయ నిపుణుడు వేరుశెనగ పంటను పూర్తిగా నిషేధించాలని సూచించాడట. రైతులు అమాయకులైనట్లు వేరుశెనగ పంట ఏక పంట విధానమని, వైవిధ్య పంటలు పండించాలని సూచించారు. జిల్లా వాస్తవ పరిస్థితుల్ని గానీ, రైతుల స్థితిగతుల గురించి గానీ అర్థంచేసుకోకుండా వీరంతా వైయక్తిక ధోరణిలో మాట్లాడ్తూ వున్నారని అనిపిస్తుంది. జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలు ఏవి పండగలవో, ఏవి రైతులను బతికించగలవో చెప్పకుండా కేవలం వేరుశెనగ పంట వేయవద్దని చెప్పడం బాధ్యతారాహిత్యమే అవుతుంది.

## ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

వ్యవసాయం ప్రకృతికి అనుకూలంగా కొనసాగినప్పుడే, ప్రకృతి వ్యవసాయానికి తోడ్పడుతుంది. ఒకే పంట విధానం ప్రకృతికి వ్యతిరేకం. ఒకే పంటను సాగుచేయడం వల్ల చీడపీడలు బలపడతాయని చెప్తారు. వేరుశెనగ పంటకు వరుసగా వస్తున్న ఆకుముడత, ఎర్రగొంగళి, శిలీంధ్ర వ్యాధులు, వేరుపురుగు, కొత్తగా వచ్చిన మొవ్వకుళ్ళు తెగులు ఈ కోవలో వచ్చినవేనని వీరి వాదన. జిల్లా భౌగోళిక పరిస్థితులు పక్కన పెడితే, ఈ వాదన చాలా సమంజసమైనదిగానే కనపడుతుంది. అయితే ఈ వాదనను ముందుకు తెచ్చేవారు, దీనితోపాటు జిల్లా స్థితిగతులు, వర్షపాతం, భూముల ఉత్పాదకతా సామర్థ్యం, ప్రత్యామ్నాయ పంటలు, వాటి అనుకూలత మొదలగు అన్ని అంశాల్నీ పరిశీలించి ఉంటే వీరి సూచనలకు బలం ఉండేది. వేరుశెనగ పంట విస్తీర్ణాన్ని పెంచడంలోనూ, సంక్షోభం ఉత్పన్నం కావడంలోనూ రైతులదే ప్రధానపాత్ర అన్నట్టుగా వీరు రైతులను దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

## సమాధానాలు రావాల్సిన ప్రశ్నలు

వేరుశెనగకు గిట్టుబాటు ధరలు రావడంలేదని, తెగుళ్ళు అధికమయ్యాయని, అందుకు వేరశెనగ పంట వేయకపోవడమే పరిష్కారమని చెప్పేవారు కొన్ని ప్రశ్నలకు నిజాయితీగా సమాధానాలివ్వవలసి వుంటుంది. ఆహార పంటల్లో గానీ, వాణిజ్య పంటల్లో గానీ నిరంతరం గిట్టుబాటు ధరలు లభించే పంటలు ఏమైనా వున్నాయా? రాష్ట్రంలో పొగాకు, మిర్చి, పత్తి, వరి లాంటి అన్ని పంటలకూ గిట్టుబాటు ధరలు లేకుండా ఏదో ఒకవిధంగా రైతులు అవస్థపడుతూనే వున్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వరకూ కొన్ని లక్షల హెక్టార్లలో కన్పించే వరి, ఏడాదిలో రెండు పంటలుగా సైతం పండించే వరి ఏక పంట విధానంగా ఈ శాస్త్రజ్ఞులకు కనిపించకపోవడం విచారకరం. అలాగే తెగుళ్ళు అధికంగా ఉండే మిర్చి, పత్తి, పొగాకు పంటల మాటేమిటి? వీటన్నిటి గురించి సలహాలివ్వని వీరు ఒక్క వేరుశెనగ గురించే వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నారు? ఈ విషయాన్ని గురించి ఆలోచించి



నపుడు ప్రాంతీయ వివక్ష ఇందులో కూడా పనిచేస్తోందా అనే అనుమానం కలక్కమానదు.

## ఏకపంట విధానానికి రైతులే బాధ్యులా?

నిస్సందేహంగా రైతులు బాధ్యులు కాదు. ఏ రైతు కూడా తన వ్యవసాయాన్ని నాశనం చేసుకోవాలని నష్టం తెచ్చుకోవాలని అనుకోడు. అలాగే వేరుశెనగ మీద రైతులకు ప్రత్యేక ప్రేమంటూ ఏమీ లేదు. రైతు రెండురకాలుగా పంటల్ని గురించి ఆలోచిస్తాడు. ఒకటి అది తన కుటుంబం బతకడానికి ఆదాయాన్నివ్వాలి. రెండు పశువులకు మేత ఉండాలి. వేరుశెనగ ఈ రెండు సమస్యల్నీ ఇంతవరకూ తీరుస్తూ వచ్చింది. ఆదాయంతోపాటు వేరుశెనగ పొట్టు పశువులకు పౌష్టికాహారంగా ఉపయోగపడుతూ వచ్చింది.

రాష్ట్రంలో సగటు వర్షపాతం 900 మి.మీ. కాగా దాంట్లో దాదాపు సగం అనంతపురం జిల్లా వర్షపాతం. అది కేవలం 520 మి.మీ.గా వుంది. ఇది కూడా జిల్లా అంతటా సమంగా కురవదు. అనంతపురం జిల్లా కేంద్రానికి పరిసరాల్లో వున్న రాప్తాడు, ఆత్మకూరు, కూడేరు మండలాల్లో అంతకంటే తక్కువ వర్షపాతమే ఉంది. పంటల కాలంలో 10-15 రోజులకు ఒకసారి ఒక మంచి వర్షం కురిస్తే పంటలు పండుతాయి కానీ వర్షానికి వర్షానికి ఒక్కోసారి నెలరోజులు కూడా ఎడం వుంటుంది. దీనితో ఫలసాయం తగ్గిపోతుంది. జిల్లాలో ఎక్కువ భాగం ఎర్రనేలలు, తువ్వనేలలు కావడంతో భూమిలో తేమ కూడా తొందరగా ఇంకిపోతుంది. ఇటువంటి వాతావరణ పరిస్థితులలో రైతు సహజంగానే ఎండవేడిమికి, వర్షాభావానికి తట్టుకొని అంతో ఇంతో ఆదాయాన్నివ్వగల పంటల రకాల్నే ఎన్నుకోవాల్సి వుంటుంది. వేరుశెనగ చాలా మొండిపంట. బెట్టకు తట్టుకుని ఈ వాతావరణంలో నిలబడగలిగేది వేరుశెనగ మాత్రమే. పంట ఊడలుదిగే దశలో ఒక పదును వర్షం వచ్చి, తరువాత ఎండిపోయే దశలో వర్షం వచ్చినా పంట పుంజుకుని అంతో ఇంతో ఫలసాయం ఇవ్వగల పంట వేరశెనగ. వర్షాలు కురిస్తే మాత్రం 3-4 వర్షాలకే పంట చేతికొస్తుంది. వేరుశెనగ రైతులకు ఆదాయాన్నివ్వడమే గాకుండా, పశువులకు మేత, వ్యవసాయ కూలీలకు, చిన్నచిన్న వ్యాపారులకు, ఆయిల్ మిల్లుల్లో కార్మికులకు ఉపాధి కూడా కలిగిస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే అనంతపురం జిల్లా రైతులకు వేరుశెనగ కల్పతరువు లాంటిది. దాదాపు 9.5 లక్షల హెక్టార్ల సాగుభూమిలో 8 లక్షల ఎకరాలు వేరుశెనగ మాత్రమే పండిస్తున్నారంటే దీని ప్రాధాన్యత అర్థమవుతుంది.

## భూమి కొరత కూడా ఒక కారణం

ప్రతి సంవత్సరం జనాభా పెరుగుతోంది. భూమిమీద ఆధారపడేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. కానీ భూమికి పెరిగే స్వభావం లేకపోవడం చేత భూమి మీద ఒత్తిడి అధికమయింది. రైతు తన ఉత్పత్తులకు ధరలు నిర్ణయించుకోలేడు గానీ, పారిశ్రామిక ఉత్పత్తి

దారులు వారి వస్తువులకు వారే ధరలు నిర్ణయించుకునే అవకాశం వుండడం చేత, రైతు కొనే వస్తువుల ధరలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయి. దేశాన్ని అభివృద్ధి పథంవైపు నడిపించాల్సిన ప్రభుత్వాలు భూమిమీద పడుతున్న అధిక ఒత్తిడిని తగ్గించడానికి ఇతరత్రా రంగాలవైపు గ్రామీణ ప్రజల్ని మళ్ళించాలి. కాని ఆ ప్రయత్నాలేవీ జరగడంలేదు. ఆధునిక యుగంలో ఒక్క వ్యవసాయం మీదనే ఆధారపడి ఏ దేశమూ మనలేదు. విద్య, వైద్యం, ఇతర కుటుంబ అవసరాలన్నీ డబ్బుతో కొనుగోలు చేయాల్సిన ఈ రోజుల్లో రైతులకు కూడా కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి వాణిజ్య పంటలే శరణ్యమౌతున్నాయి. ఆహార పంటలు రైతుల ఆర్థికావసరాల్ని తీర్చలేకపోతున్నాయి. రైతులేమీ సంఘ సంస్కర్తలు, సమాజ సేవకులు కాదు. వారి కుటుంబాల సంక్షేమం వారికి ముఖ్యం. తన కుటుంబం మనుగడకు ఉపయోగపడలేని పంటల్ని రైతు ఆదర్శం కొరకు పండించలేడు. ప్రభుత్వాలు, సమాజం రైతుల బాధల్లో పాలుపంచుకోకుండా రైతులు మాత్రం సమాజంకోసం బతకాలని కోరడం అన్యాయమనిపించుకుంటుంది.

## పంటల వైవిధ్యానికి రైతులు వ్యతిరేకులా?

కాదు. గత 50 సంవత్సరాల పంటల సరళిని, నీటిపారుదల జరిగిన కొన్ని ప్రాంతాల రైతులను గమనిస్తే రైతులు ఎంతమాత్రం పంటల వైవిధ్యతకు వ్యతిరేకం కాదని అర్థమవుతుంది. గతంలో ఏ పంట కూడా అధిక విస్తీర్ణంలో వుండేది కాదు. అరికెలు, రాగులు, కొర్రలు, వేరుశెనగ, పత్తి, సజ్జలు, జొన్నలు పండించేవారు. చెరువుల కింద వరి, రాగులు పండించేవారు. వేరుశెనగ, పత్తి వాణిజ్య పంటలుగా పండించినా అవి పరిమితంగానే వుండేవి.

పంటల ఉత్పత్తి ఖర్చులు కూడా నామమాత్రంగానే వుండేవి. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులు, వ్యవసాయం మీద పెరుగుతున్న ఒత్తిళ్ళమూలంగా ఆహార ధాన్యాల స్థానాన్ని వేరుశెనగ ఆక్రమించి సంవత్సరం సంవత్సరం పెరుగుతూ పోయింది. రైతుల అవసరాల్ని తీర్చగల స్థాయికి వేరుశెనగ చేరడం ఒక కారణమయింది. పంట సరళిలో వచ్చిన మార్పులు ఈ కింది పట్టిక ద్వారా గమనించండి.

| సంవత్సరం | ఆహార ధాన్యాల పంట | వేరుశెనగ పంట (విస్తీర్ణం హె.) |
|---|---|---|
| 1975-76 | 5,88,000 | 3,25,000 |
| 1980-81 | 4,30,000 | 3,35,000 |
| 1984-85 | 2,99,000 | 4,73,000 |
| 1996-97 | 1,64,000 | 7,58,100 |
| 2000-01 | 0,98,000 | 7,98,000 |

('కదలిక' నవంబర్ సంచికలోని విశ్వేశ్వరరావుగారి వ్యాసం నుంచి)



అంతకుముందున్న తీగెచెనిక్కాయ స్థానంలో టియంవి-2 రకాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి పర్చారు. 1960 దశకం నుంచి జిల్లాలో మెల్లమెల్లగా టియంవి-2 రకాన్ని రైతులు పండించడం అలవాటు చేసుకున్నారు. కాయలు గుత్తులుగా వుండడం, కాయ ఊడలు బలంగా వుండి కాయలు భూమిలోకి జారకుండా వుండడం, కాయసైజు బాగా వుండడం దీని ప్రత్యేకతలు. దీని తర్వాత చాలారకాల వేరుశెనగ విత్తనాలు మార్కెట్లోకి వచ్చినా, అధిక ఉష్ణోగ్రతకు టియంవి-2 తట్టుకున్నంతగా ఆ రకాలు తట్టుకోలేకపోయాయి.

ఇతరత్రా పంటల విస్తీర్ణం పెరగకపోవడానికి నీటిపారుదల సౌకర్యాలు లేకపోవడం ఒక కారణం. జిల్లాలోని సాగుభూమిలో 7 శాతం మాత్రమే కాలువలు, బావుల ద్వారా నీటి వసతి కలిగి వుంది. ఏ ప్రాంతంలో అయినా వ్యవసాయం మనగలగడానికి కనీసం 30 శాతం భూభాగానికి నమ్మకమైన నీటివసతి వుండాలి. అత్యల్ప వర్షపాతం వున్న జిల్లాకు బయటినుంచి నదీ జలాల్ని మళ్ళించి ఈ లోపాల్ని పూరించవలసి వుండగా, సంవత్సరాలు గడుస్తున్నా ఆందోళన చేస్తున్నవారి తరాలు మారినా పరిస్థితిలో మార్పురాలేదు.

నీటిపారుదల అవకాశాలు వున్నచోట రైతులు వైవిధ్య పంటలు కూడా పండిస్తున్నారన డానికి పెద్దవడుగూరు, తాడిపత్రి, కొండాపురం మండలాల రైతుల్ని గమనిస్తే అర్థమవుతుంది. వీరు మిర్చి, పసుపు, అరటి,వాము, బిస్కెట్‌జొన్న, పత్తి లాంటి వాణిజ్య పంటల్ని కూడా పండిస్తున్నారు. ఏ పంట ఆదాయాన్నిస్తుందనుకుంటే ఆ పంటల్ని వేస్తున్నారు. రైతులు మానసికంగా ఒక పంటకు మాత్రమే కట్టుబడి లేరని దీనిద్వారా అర్థమవుతున్నది. అయితే తెగుళ్ళు, మార్కెట్ మాంద్యం లాంటి కారణాల చేత ఒక సంవత్స రం ఒక పంటకు వచ్చిన మార్కెటు మరో సంవత్సరంలో వుండడం లేదు. పెద్దవడుగూరు మండలంలో జనవిజ్ఞాన వేదిక రైతుల సమావేశాన్ని ఏర్పాటుచేసినపుడు సూర్యనారాయణరెడ్డి అనే రైతు 80 వేల రూపాయల పెట్టుబడితో 10 ఎకరాలలో పత్తి పంట వేస్తే, దిగుబడి రాక, రేటు రాక ఎకరాకు 7,8 వేలు నష్టం వచ్చిందని చెప్పాడు. క్వింటాలుకు 2700 నుంచి 2500 వరకు అంతకుముందు సంవత్సరం పలికిన ధర ఈసారి 1800 కంటే పెరగలేదని బాధపడినాడు. మరొక రైతు 18 ఎకరాలు కందులు వేస్తే, కందులకు ధర పలకడం లేదని, కందులు కొనేవారు కూడా లేరని చెప్పాడు. అంతకుముందు సంవత్సరం బిస్కెట్ జొన్న క్వింటాలుకు 800 ధర పలికిందని చాలామంది ఈసారి ఈ పంటవేస్తే రు.350కు మించి పెరగడం లేదని చెప్పారు. దీనినిబట్టి అర్థమవుతున్నదేమిటంటే, సంక్షోభం ఒక్క వేరుశెనగనే ఆవరించలేదు. అన్ని పంటలకూ ఈ సంక్షోభం ఆవరించి వుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకులు వ్యవసాయం ప్రస్తావన వచ్చినప్పుడల్లా మనది వ్యవసాయ దేశమని, రైతే దేశానికి వెన్నెముక అని అభివర్ణిస్తుంటారు. రైతులకు, వ్యవసాయానికి వీరిస్తున్న మర్యాదకు సెల్యూట్ చేయవలసిందే కానీ ఈ వెన్నెముకను

కాపాడుకోవడానికి మన ప్రభుత్వాలు ఏమి చేశాయని ప్రశ్నిస్తే దిక్కులు చూడవలసిన పరిస్థితి దాపురించింది. అతిముఖ్యమైన అంశం అయినటువంటి డబ్ల్యుటిఓ గురించి కనీసం పార్లమెంటులో చర్చలు చేయలేదు. చట్టబద్ధమైన శాసనసభలకు కానీ, రాష్ట్ర ప్రభుత్వాలకు గానీ, దేశ ప్రజలకు గానీ తెలియజేయకుండా డబ్ల్యుటిఓలో సంతకం చేయడం ఈ దేశ సార్వభౌమత్వం మీద, ప్రజల మీద, రైతుల మీద వీరికున్న గౌరవాన్ని తెలియజేస్తుంది. ఒకపక్క ప్రపంచబ్యాంకు షరతులకు లోబడి రైతులకిస్తున్న కనీస రాయితీల్ని కేంద్ర ప్రభుత్వం తొలగిస్తుంటే, మరోపక్క ఎరువుల మీద రాయితీల్ని రాష్ట్ర ప్రభుత్వం తొలగించి ఎరువుల ధరలు పెరగడానికి కారణమైంది. ఇంకో పక్క డబ్ల్యుటిఓ ఒప్పందాల వల్ల వ్యవసాయ ఉత్పత్తి ధరలు నిలకడగా లేక, ఒక్కొక్కసారి ఉత్పత్తులు కొనే నాథుడే లేక రైతులు అల్లాడుతున్నారు.

డబ్ల్యుటిఓ ఒప్పందం చేసుకున్న కొన్నిదేశాలు దిగుమతుల మీద హెచ్చు సుంకాలు వేసి తమ దేశీయ ఉత్పత్తులను రక్షించుకుంటూ వుంటే, మనవారు ఒప్పందంలో భాగంగా గతంలో 714 ఉత్పత్తుల మీద, ఈ ఏప్రిల్ మాసంలో మరో 715 ఉత్పత్తుల మీద ఆంక్షలు ఎత్తివేయడం వలన విదేశీ ఉత్పత్తులు ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడుతున్నాయి. ఇవి దేశీయ మార్కెట్‌ను దారుణంగా దెబ్బతీశాయి. అన్నివర్గాల ప్రజల నుంచి ఆందోళనలు రావడం గమనించిన ప్రభుత్వం వీటి ప్రభావాలు పరిశీలించి, తగు సూచనలు ఇవ్వడానికి శరత్‌జోషి అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక కమిటీని నియమిస్తున్నట్లు తెలిపింది.

అమెరికా వేరుశెనగ మీద 300 శాతం సుంకం విధిస్తే, ఇండియా పామోలిన్ దిగుమతుల మీద 25 శాతం మాత్రమే సుంకం విధించింది. కేరళ, గుజరాత్, ఆంధ్ర రాష్ట్రాల ప్రజల నుంచి వచ్చిన ఆందోళనల వల్ల ప్రస్తుతం ఈ సుంకాన్ని 70 శాతానికి పెంచింది. అయినా మార్కెట్‌లో వేరుశెనగకు రేటు పెరగడం లేదు. సుంకం పెంచినప్పటికీ పామాయిల్ ఇంకా తక్కువ ధరకు దొరుకుతుండడమే కారణం. రైతుల మానాన రైతులను ప్రభుత్వాలు వదిలేశాయి.

డబ్ల్యుటిఓ పుణ్యమా అని పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ దేశాలలోని రైతులకు ఏ విధంగా సహాయపడుతున్నాయని మనకు ఇపుడిపుడే తెలుస్తున్నది. డబ్ల్యుటిఓకు వ్యతిరేకంగా అగ్రభాగాన వుంటూ రాష్ట్రంలోని రైతులను చైతన్యపరుస్తున్న వ్యవసాయ నిపుణులు ప్రొ॥ కె.ఆర్. చౌదరి గారు రాసిన వ్యాసం ఆధారంగా ఆయా దేశాలు తమ రైతులు పండించే పంటలకు ఏ మేరకు సబ్సిడీలు ఇస్తున్నాయో గమనించండి.



## సబ్సిడీల పట్టిక

| | | |
|---|---|---|
| జపాన్ | – | 72.5 శాతం |
| కొలంబియా | – | 54.0 శాతం |
| దక్షిణ కొరియా | – | 61.0 శాతం |
| యూరప్ | – | 37.0 శాతం |
| చైనా | – | 34.0 శాతం |
| పాకిస్థాన్ | – | 26.0 శాతం |
| అమెరికా | – | 26.8 శాతం |
| ఇండియా | – | 3.0 శాతం |

అన్నిటికంటే మన భారతదేశమే సబ్సిడీలు చాలా తక్కువగా ఇస్తున్నట్లు దీన్నిబట్టి అర్థమవు తున్నది. పాకిస్తాన్ కంటే కూడా తక్కువస్థాయిలో ఉన్నాం మనం. ఇవికాక ఆయా దేశాలు రైతులు పంటలు పండించకుండా తమ పొలాలు బీళ్ళు పెట్టుకునేందుకు కూడా పరిహారం చెల్లిస్తున్నాయి. ఒకప్పుడు వ్యవసాయకంగా ఎంతో వెనుకబడిన దేశాలు ఇప్పుడు తక్కువ ధరకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల్ని అందించగలుగుతున్నాయంటే ఆయా ప్రభుత్వాలు జనెటిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీ నుంచి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర ఇన్‌పుట్స్ అందించడం వల్లనే సాధ్యమవుతున్నదనే విషయాన్ని గుర్తించాలి. ఆఖరికి క్రిమి సంహారక మందులను నియంత్రించడంలో కూడా ఘోరంగా విఫలమయింది మన ప్రభుత్వం. మన దేశంలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులలో క్రిమిసంహారక మందుల ద్వారా విష పదార్థాల అవశేషాలు పరిమితికి మించి వున్నాయని ఆయా దేశాలు మన దిగుమతులకు నిరాకరిస్తున్నాయి. సైన్సు ఎంత అభివృద్ధి చెందినా నీటి ఆధారం లేకుండా పంటలు పండించగలిగే విజ్ఞానం ఇంకా అభివృద్ధి చెందలేదు. చాలా తక్కువ నీటి వనరులు కలిగిన ఇజ్రాయిల్ ఇసుక నేలల్లో పంటలు పండించే విజ్ఞానాన్ని తన రైతులకు అందిస్తుంటే, అపారమైన జలవనరులు గల మనదేశంలో రైతులకు సాగునీరు అందించడంలో కూడా ప్రభుత్వాలు విఫలమయినాయి.

అత్యధిక వర్షపాతం కలిగిన ప్రాంతంలో కూడా 30 శాతం నమ్మకమైన నీటిపారుదల సౌకర్యం వున్నప్పుడే ఆ ప్రాంతం వ్యవసాయకంగా నిలదొక్కుకోగలదని చెప్పాం. అటువంటిది అత్యల్ప వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత గల అనంతపురం జిల్లాలో సాగుభూమిలో 7 శాతానికి కూడా నీటివసతి లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఈమధ్య ప్రభుత్వం వ్యవసాయం మీద ప్రకటించిన వ్యూహపత్రంలో అనంతపురం జిల్లాలో సగటున 5.7 శాతం అభివృద్ధి రేటు సాధిస్తామని ప్రకటించింది. ఇది చదవడానికి, చదివిన

వారికి ఒళ్ళు పులకరించేందుకూ పనికొస్తుందేమోకాని, ఇక కొద్దిరోజుల్లో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజనులో ప్రభుత్వం ఏవిధంగా ఆ 5.7 శాతం అభివృద్ధిని సాధిస్తుందో, ఆ అభివృద్ధిలో రైతులు ఎలా భాగస్వామ్యం కావాలో రైతులకు మాత్రం తెలియదు.

## వ్యవసాయ శాస్త్రవేత్తలు విస్మరించిన బాధ్యతలు

వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వం మనస్సు నొప్పించకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు తప్ప వాస్తవ దృక్పథంతో ఆలోచించడం లేదు. ఏ పంటకు ఎంత నీరు కావాలో, ఎటువంటి వాతావరణముండాలో వీరికి బాగా తెలుసు. ఇటువంటి విజ్ఞానవంతులు అనంతపురం జిల్లాలో పంటలు పండించడానికి అవసరమైన నీటివనరులు, ఇన్‌పుట్స్ కల్పించడంలో విఫలమైన ప్రభుత్వాల్ని తప్పుబట్టే బదులు రైతులదే తప్పని చాలా సులభంగా చెప్పగలుగుతున్నారు. అనంతపురం జిల్లాకు సాగునీటిని అందివ్వడం గురించి మాట్లాడకుండా కేవలం పంటల గురించే మాట్లాడడం వాస్తవాలను రాల్ని విస్మరించినట్లే అవుతుంది. అనంతపురం జిల్లా వాతావరణానికి సరిపోయే వంగడాల్ని అభివృద్ధి చేయడంలోనూ, రోగనిరోధక వేరుశెనగ విత్తనాల్ని అభివృద్ధిపర్చడంలోనూ శాస్త్రజ్ఞులు వెనుకబడి వుండానికి కారణాల్ని అన్వేషించాలి.

## మన ముందున్న సవాళ్ళు

గత 53 సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు వ్యవసాయంపై కావలసినంత శ్రద్ధ వహించక పోవడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటు లేక రైతులు సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. ఈ పరిస్థితులలో వ్యవసాయ ఉత్పత్తులకు సరిఅయిన రక్షణ కల్పించకుండా, అంతర్జాతీయ మార్కెట్‌తో రైతు పోటీపడగలిగే సామర్థ్యం పెంపొందించకుండా డబ్ల్యుటిఓతో ఒప్పందం చేసుకుని వ్యవసాయ దిగుమతుల మీద ఆంక్షలు తొలగించడంతో రైతు నిస్సహాయంగా బలయ్యే పరిస్థితికి నెట్టబడ్డాడు. మనకంటే అధిక జనాభా కలిగి, 1949కి ముందు మన దేశంకంటే బాగా వెనుకబాటుతనం కలిగివున్న చైనా దేశం ఈనాడు 1/3 వంతు భూభాగానికి సాగునీటి వసతి కల్పించింది. వ్యవసాయానికి అధునాతన సాంకేతిక విజ్ఞానం జోడించడంవల్ల అన్ని ఉత్పత్తుల్లోనూ ఒక హెక్టారుకు మనకంటే రెండింతలు ఉత్పత్తులు సాధిస్తున్నారు వాళ్లు. మన దేశం ప్రపంచంలో వేరుశెనగ అత్యధికంగా పండించే దేశాలలో రెండవది అయినా ఎకరాకు సగటు ఉత్పత్తిలో 70వ స్థానంలో మాత్రమే వుంది. అలాగే సోయాబీన్ ఉత్పత్తిలో 5వ స్థానంలో వుంటే సగటు ఉత్పత్తిలో 62వ స్థానం, ఆవాలు ఉత్పత్తిలో మూడవ స్థానంలో ఉంటే సగటు ఉత్పత్తిలో 40వ స్థానం, సన్‌ఫ్లవర్ ఉత్పత్తిలో 6వ స్థానంలో వున్నా సగటు ఉత్పత్తిలో 51వ స్థానంలో వుంది. ప్రపంచ దేశాలలో ఈ విధంగా వెనకబడి ఉండడానికి కారణం, చాలా భూభాగాలకు సాగునీటి వసతి కల్పించ



డంలో, రైతులు వ్యవసాయ ఉత్పత్తుల్ని పెంచడానికి అనువైన సాంకేతిక విజ్ఞానాన్ని అందివ్వడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందడమే. వ్యవసాయంలో అగ్రగాములుగా వున్న పంజాబ్ రైతులు సైతం అప్పుల సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నారంటే, మన దేశ వ్యవసాయ విధానాల్లోని లోపాలేమిటో సీరియస్‌గా వెతుక్కోవాల్సిన అవసరముంది.

ఇటువంటి పరిస్థితుల్లో సాగునీటి వసతులు లేకుండా అత్యంత తక్కువ వర్షపాతంతో ఎడారి ప్రాంతాన్ని తలపించే అనంతపురం జిల్లాలో వ్యవసాయాన్ని రైతుల మానాన రైతులకే వదిలిపెట్టి అంతో ఇంతో ఆదాయాన్నివ్వగల వేరుశెనగ పంటను విడనాడమని చెప్పే సలహాలు ఒక క్రూయల్ జోక్‌గా వుండగలవు. ఒక్క వేరుశెనగకే కాదు, ధాన్యం ధరలు, మిర్చి, పసుపు, పత్తి, కొబ్బరి, రబ్బరు, జీడిమామిడి, కోకో, సోయాబీన్ వగైరా పంటల ధరలన్నీ పడిపోయినాయి. ఈ సంక్షోభానికి, దురవస్థకు కారణం ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రపంచీకరణ విధానాలేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నష్టం వస్తున్నదని ప్రతి పంటనూ వేయవద్దని సలహాలిచ్చుకుంటూపోతే చివరికి రైతుకు ఏ పంటా మిగలదు. ప్రపంచ వాణిజ్య సంస్థ సరిగ్గా కోరుకుంటున్నదిదే. చైనా తర్వాత అత్యధిక జనాభా కలిగిన ఈ దేశపు మార్కెట్టును పూర్తిగా కైవసం చేసుకోవడానికి వీలుగా, ఈ దేశంలోని ఉత్పత్తుల వ్యవస్థను దెబ్బకొట్టడానికి ముందుగా అత్యంత చౌకగా వస్తువుల్ని మార్కెట్‌లో ప్రవేశ పెడ్తారు. ఉత్పత్తి వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైన తర్వాత వారి దిగుమతులకు వారే ధరలు నిర్ణయిస్తారు. ఇది వ్యాపారసూత్రం. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌ను కైవసం చేసుకోవడానికి ప్రస్తుతం ప్రపంచ వాణిజ్య సంస్థలు అవలంబిస్తున్న విధానమిదే. ఈ ప్రమాదకర సంకేతాల్ని అర్థం చేసుకునే బదులు రైతులను, దేశాన్ని అప్రమత్తం చేసే బదులు ప్రపంచ వాణిజ్య సంస్థల పల్లవిని అందుకోవడం, ప్రచారంలో పెట్టడం సమర్థనీయం కాదు. అనంతపురం జిల్లాలో వ్యవసాయాన్ని పరిపుష్టం చేయడానికి ఈ కింది తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి.

## తక్షణ చర్యలు

1. వేరుశెనగ తెగుళ్ళ మీద పరిశోధనలు చేసి రోగనిరోధక విత్తనాలను ఉత్పత్తి చేయగలిగేలా అనంతపురం జిల్లాలోని మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని అభివృద్ధి పర్చాలి. అందుకు కావలసిన నిధులు విడుదల చేయాలి.
2. వేరుశెనగ పంట సంవత్సరంలో ఒక మారు వేసే పంట కాబట్టి దీనిని ఏకపంట విధానంగా చూడకుండా పంట, విత్తనం దగ్గర్నుంచి పంట ఒడిపే వరకూ రైతులకు అవసరమైన సలహాలు ఇవ్వడానికి వ్యవసాయ శాఖలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి.
3. రైతులకు మంచి విత్తనకాయల్ని సరఫరా చేయాలి.

4. పామోలిన్ నూనె దిగుమతుల్ని నియంత్రించేందుకు దానిపై 300 శాతం దిగుమతి సుంకాన్ని విధించాలి. 20 శాతం మించి వచ్చిన దిగుమతులపై యాంటి డంపింగ్ సుంకాన్ని విధించాలి.
5. ప్రభుత్వ ఆధ్వర్యంలో వేరుశెనగ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, మద్దతు ధరలతో విదేశాలకు ఎగుమతులను ప్రోత్సహించాలి.

## దీర్ఘకాలిక చర్యలు

1. డబ్ల్యుటిఓ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని మినహాయించాలి.
2. జిల్లాకు ఉన్న ప్రత్యేక వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రాడార్ వ్యవస్థను ఏర్పాటుచేసి కృత్రిమ వర్షాలను కురిపించాలి. జిల్లాలో కృత్రిమ వర్ష సాధన సమితి ఈ వరకే ఏర్ప డింది. కాబట్టి దాని ఆధ్వర్యంలో పరిశోధనలు కొనసాగించాలి. జిల్లాలో సాగునీటి వసతి కల్పించడానికి వీలుగా వరద కాలువ నిర్మాణాన్ని చేపట్టాలి. పెన్న అహోబిలం బాలెన్సింగ్ రిజర్వాయరుకు 10 టిఎంసిల నికర జలాల్ని కేటాయించాలి. హంద్రీ-నీవాను సాగునీటి పథకం కింద చేపట్టాలి. జిల్లాలో వున్న చిన్ననీటి వనరుల్ని పునరుద్ధ రించి చెరువులను బలోపేతం చెయ్యాలి. బచావత్ ఒప్పందం 2000 ఏప్రిల్ నాటికే ముగిసింది కాబట్టి కర్నాటక ప్రభుత్వంతో తిరిగి చర్చలు ప్రారంభించి తుంగభద్ర జలాల్ని పునఃపంపిణీ చేయాలి. రాయలసీమకు ముఖ్యంగా అనంతపురం జిల్లాకు నీటి పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలి.

(ఏప్రిల్, 2001)



# రైతుల ఆత్మహత్యలు

**ఆ**త్మహత్యలు అనేవి ఏ సమాజంలోనూ కొత్తవికావు. జీవితంలో విసిగి వేసారిన దుర్బలులు, మానసిక చాంచల్యం గలవారు ఆత్మహత్యలు చేసుకోవడం కద్దు. వ్యక్తిగత సమస్యలకే పరిమితం కావల్సిన ఆత్మహత్యలు సామాజిక రూపం సంతరించుకున్నప్పుడు తప్పనిసరిగా వాటికి కారణాలు అన్వేషించాలి. యుద్ధప్రాతిపదికన వాటిమూలాలు వెదికి నివారణో పాయాలు చేపట్టాలి. అది నాగరిక సమాజాల బాధ్యత. భూమ్మీద పుట్టిన ఏ ప్రాణి అయినా సహజ మరణం వచ్చేంతవరకూ తన జీవన ప్రస్థానాన్ని కొనసాగిస్తుంది. అటువంటిది నూరేళ్ళూ బతకాల్సిన వారు తమ పేగుబంధాల్ని, ఆప్తుల్ని వదులుకొని బలవన్మరణం పొందు తున్నారంటే వారిని ఈ విపరీత చర్యలకు పాల్పడేటట్లు చేసిన సామాజిక పరిస్థితుల్ని మనం సీరియస్‌గా అధ్యయనం చెయ్యాలి. వాటిని మార్చుకునే ప్రయత్నమూ చేయాలి. సమాజానికి ఏ వర్గమైతే వెన్నెముక అన్నామో, ఆ వెన్నెముకగా వుండాల్సిన రైతులే వరుసగా ఆత్మహత్య లకు పాల్పడడం జరుగుతోంది. శాస్త్ర విజ్ఞానం పెరిగిన దశలో గ్రామీణ ప్రాంతాలలో సైతం ప్రతి ఇంటికి ఇ-మెయిల్ చిరునామా కల్పిస్తానంటూ, నిద్రపోకుండా రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నానంటూ ప్రకటినలిస్తున్న ప్రభుత్వాధినేతలున్న రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం విడ్డూరమే మరి. రెండూ ఒకదానికొకటి పొసగని విషయాలు.

## ఎప్పుడు మొదలయ్యాయి?

2000 సంవత్సరం సెప్టెంబరు 15న అనంతపురం మండలం చియ్యేడు గ్రామంలో బండి నరసింహులు అనే రైతుతో ప్రారంభమయిన ఆత్మహత్యల పరంపర ఈనాటికీ కొనసాగుతున్నది. 2004 మార్చి నాటికి 331 మంది రైతులు జిల్లాలో ఆత్మహత్య చేసుకున్నారు.

2000 సంవత్సరంలో - 52 మంది
2001 సంవత్సరంలో - 93 మంది
2002 సంవత్సరంలో - 81 మంది
2003 సంవత్సరంలో - 105 మంది

ఈ విధంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాల వివరాల్ని పరిశీలిస్తే, వీరిలో కొద్దిమంది చిన్నపిల్లలు మినహా అందరూ కుటుంబాల బరువు బాధ్యతల్ని మోస్తున్నవారే. వారివారి గ్రామాల్లో మంచి వ్యక్తులుగా పేరు తెచ్చుకున్నవారు. వ్యక్తిగత వ్యసనాలున్నవారు కాదు. మొత్తం కేసుల్ని పరిశీలిస్తే వీరందరిలోనూ పది మంది మాత్రమే తాగుడుకు బానిస అయినవారు. అది కూడా అలవాటుగా సంక్రమించిన వ్యసనంగా కాక, జీవితంలో ఎదురవు తున్న మానసిక ఒత్తిళ్ళను తట్టుకోలేక తాగుడును ఒక పరిష్కారంగా ఎంచుకున్నవారు. 75 శాతం మందికి నేరుగా వ్యవసాయంలో పెట్టుబడులకోసం చేసిన అప్పులు ఆత్మహత్యలకు కారణమయితే, 25 శాతంమందికి ఆడపిల్లల పెళ్ళిళ్ళ వల్ల పెరిగిన అప్పుల్తోపాటు, వ్యవసాయంలో పెట్టుబడుల కొరకు చేసిన అప్పులు కూడా ఆత్మహత్యలకు కారణ మయ్యాయి. ఆఖరికి పసిపిల్లల ఆత్మహత్యలకు కూడా వ్యవసాయంలో జరిగిన నష్టాలే కారణం కావడం గమనించవలసిన అంశం. ఆత్మహత్యలు చేసుకున్న కొంతమంది రైతుల నేపథ్యాన్ని పరిశీలిద్దాం.

## సోమగట్ట ఉత్తమరెడ్డి

**ఓ.**డి.సి. మండలం గాజుకుంటపల్లి గ్రామానికి చెందిన సోమగట్ట ఉత్తమరెడ్డి (30 సం.) 28.2.2002న మోనోక్రోటోఫాస్ తాగి మరణించాడు. ఉత్తమరెడ్డికి భార్య, 9 సంవత్సరాల క్రిష్ణవేణి అనే కూతురు, 6 సంవత్సరాల మోహనరెడ్డి అనే కుమారుడు వున్నారు. ఏ రకమైన దురలవాట్లు లేనివాడు. ఎంతో ఉత్తముడుగా పేరు తెచ్చుకున్నాడు. తన పిల్లలకు మంచి చదువు రావాలనే ఉద్దేశ్యంతో దాదాపు 3 కి.మీ. దూరం వున్న మండల హెడ్క్వార్టరు ఓ.డి. సిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో కూతుర్ని 5వ తరగతి, కొడుకును 1వ తరగతి చదివిస్తు న్నాడు. సి.పి.ఐ. అనుబంధ సంస్థ అయిన రైతు సంఘంలో చురుకైన కార్యకర్త. తనకున్న ఎకరా 10 సెంట్ల పొలానికి తోడుగా మరికొంత భూమిని కౌలుకు తీసుకుని వేరుశెనగ పంట వేశాడు. గత నాలుగు సంవత్సరాలుగా పంట పెట్టుబడులు కూడా రాలేదు. సొసైటీల్లో తీసుకున్న అప్పులు దాదాపుగా 20 వేలు. వాటి కోసం వత్తిడి మొదలయింది. 2001లో వెనక చిక్కి కురిసిన భారీ వర్షాల వల్ల అర ఎకరం నీరు పారించడానికి బావిలో నీళ్ళు వచ్చా యి. కరెంటు బిల్లులు కట్టలేదని అంతకుముందే రెస్కో (గ్రామీణ విద్యుత్ సంస్థ) కనెక్షన్ తొలగించింది. బిల్లులు కట్టినా తిరిగి కనెక్షన్ ఇవ్వడానికి సిబ్బంది రెండువేలు అడిగారు. అన్నివిధాలా ఊపిరి ఆడని అప్పుల బాధతో 30 వేల కోసం ఒక నిండు ప్రాణం పోయింది.

## సోమ్లా నాయక్

**గో**రంట్ల మండలం కరావులపల్లి తాండాకు చెందిన 45 సంవత్సరాల సోమ్లానాయక్ గిరిజనుడు. 15.02.02న మోనోక్రోటోఫాస్ తాగి మరణించాడు. సోమ్లానాయక్‌కు భార్య,



ముగ్గురు పిల్లలు వున్నారు. పెద్ద కుమారుడు రమేష్‌నాయక్ నెల్లూరులో రెండవ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. 9వ తరగతి చదువుతున్న కూతురు అనిత, 6వ తరగతి చదువుతున్న రాజేష్‌లను బంధువులు హైదరాబాద్‌లో చదివిస్తున్నారు. ఇంజనీరింగ్ చదువుతున్న కుమారుడి బాధ్యత సోమ్లానాయకే చూసుకుంటున్నాడు. సోమ్లా నాయక్ తన రెండెకరాల పొలంతోపాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. 3 సంవత్సరాల నుండి వేరుశెనగ పంటలో పెట్టుబడులు కూడా రాలేదు. కొడుకు ఇంజనీరింగ్ పూర్తిచేస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని భార్యాభర్తలు అహర్నిశలు శ్రమించేవారు. పంట పెట్టుబడుల నష్టం, కుటుంబ పోషణ, కొడుకు చదువులకోసం చేసిన అప్పులు మొత్తం లక్షా తొమ్మిదివేలకు చేరుకున్నాయి. అప్పులు తీర్చమని ఒత్తిళ్ళు ఎక్కువయ్యాయి. దాంతో తన కుమారుని ఉన్నతిని చూడకుండానే తన బాధలకు ముక్తిని వెతుక్కున్నాడు.

## హరిజన కుల్లాయప్ప (45 సం.)

**ధ**ర్మవరం మండలం మచ్చురామి గ్రామానికి చెందిన హరిజన కుల్లాయప్ప 16.1.2002న మోనోక్రోటోఫాస్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుల్లాయప్పకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు, 70 సంవత్సరాల తల్లి వున్నారు. కుల్లాయప్పకు అయిదు ఎకరాల భూమి వుండేది. పంటలు పండకపోవడం వల్లనూ, కొడుకులు కూతుళ్ళ పెళ్ళిళ్ళకోసం చేసిన అప్పులు తడిసి మోపెడయినందు వల్లనూ 4 ఎకరాలు అమ్మివేశాడు. ఉన్న ఎకరం పొలానికితోడు 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశెనగ పంట వేశాడు. కాని పెట్టుబడి కూడా రాలేదు. పెట్టుబడులకోసం, కుటుంబ అవసరాలకోసం చేసిన అప్పుల ఒత్తిడి అధిక మయింది. ఈ సమస్యల్నుంచి బయటపడే మార్గం కానరాక, అప్పులు తీర్చేదారి లేక చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. శవాన్ని పోస్టుమార్టం చేయడానికి ధర్మవరానికి తరలించ వలసిందిగా పోలీసులు వత్తిడి చేశారు. గ్రామంలోని దళిత కుటుంబాల వారికి బండ్లు లేవు. అగ్రకులాల వారికి వున్నా దళితులు కాబట్టి ఇవ్వలేదు. ఈ పరిస్థితుల్లో మళ్లీ అప్పులు చేసి ధర్మవరం నుంచి బాడుగ జీపు మాట్లాడి శవాన్ని పోస్టుమార్టం చేయించడం కుటుంబ సభ్యు లకు తలకు మించిన పనయింది. ప్రభుత్వపరంగా అందజేసిన 10 వేల సాయం కర్మకాండ లకు, జీపు బాడుగలకు చేసిన అప్పులకే సరిపోయింది. కుల్లాయప్ప భార్య సంజమ్మకే తిండికి టికానా లేదు. 70 సంవత్సరాల అత్తను కూడా పోషించాల్సి వుంది. భర్తచేసిన అప్పులు చెల్లించాలి. చనిపోయి కుల్లాయప్ప అప్పుల నుండి విముక్తి పొందితే, బతికి భార్య సంజమ్మ మరింత అప్పుల ఊబిలోకి దిగబడిపోయింది.

## బండి నరసింహులు

**అ**నంతపురం మండలం చియ్యేడు గ్రామానికి చెందిన బండి నరసింహులు (41 సం)

అనే రైతు 15.9.2000న మోనోక్రోటోఫాస్ తాగి జిల్లాలో రైతుల ఆత్మహత్యల పరంపరకు శ్రీకారం చుట్టాడు. పొలంలో బాగా పెరిగిన వేరుసెనగ పంటను చూసి బాగా ఆదాయం వస్తుందనుకున్న దశలో మొవ్వ తెగులు కార్చిచ్చులా కబళించడంతో గుండె చెదిరి ఆత్మ హత్య చేసుకున్నాడు. దాదాపు 1.50 లక్షల అప్పు ఉంది అతనికి. సొసైటీల్లో 47 వేలు, బ్యాంకులో 12 వేలు, ఆసాముల వద్ద 80 వేలు వుంది. ఒక కుమారుడు ఇంటర్ చదివి ఇంటివద్దే వున్నాడు. రెండో కుమారుడు మగ్గం పని నేర్చుకున్నాడు. 5 ఎకరాల భూమి వున్నా కూలి పనులకు వెళ్ళి పొట్ట పోసుకుంటున్నారు. ప్రభుత్వపరంగా 10 వేలు మాత్రమే సహాయం అందింది. జిల్లాలో జరిగిన మొదటి ఆత్మహత్య కావడంతో బాగా ప్రచారం జరిగి అన్ని రాజకీయ పార్టీల నాయకులు వెళ్ళి పరామర్శించారు. అందరూ సాయం అందజేసి వుంటారని అప్పులవాళ్లు వాళ్లపై మరింత ఒత్తిడి పెట్టారు. కానీ దొరికిన సహాయం కర్మకాండలకు, రెండు నెలల కుటుంబ జీవనానికి మాత్రమే సరిపోయాయి. నరసింహులు భార్య లక్ష్మమ్మ వున్న అయిదెకరాలతో కొడుకుల్ని ప్రయోజకుల్ని చేస్తుందో, భర్త అప్పుల్నే తీరుస్తుందో చెప్పడం కష్టం.

## అబ్దుల్ రహమాన్

**కూ**డేరు మండలం ఉదిపిరి కొండకు చెందిన అబ్దుల్ రహమాన్ (38 సం.) వృత్తిరీత్యా టైలర్. భార్య పేరు షరీఫా. 18,15,12 సంవత్సరాల వయస్సు గల ముగ్గురు కుమారులు, 11 సంవత్సరాల వయస్సుగల ఒక కుమార్తె వున్నారు. వ్యక్తిగా ఏ దురలవాట్లు లేనివాడు. గ్రామంలో అందరికీ తలలో నాలుకలా బతుకుతున్నవాడు. పిల్లలు పెద్దయినకొద్దీ కుటుంబ భారం అధికమయింది. టైలర్ వృత్తిలో వస్తున్న ఆదాయం చాలదనిపించి తనకున్న 2 ఎకరాల భూమిలో స్వంతంగా వ్యవసాయం మొదలుపెట్టాడు. బాగా ఎగుడుదిగుడుగా వున్న భూములు కావడంతో వర్షాలకు భూసారం కొట్టుకుపోయి రాళ్ళు తేలినాయి. వరుసగా నాలుగు సంవత్సరాలు అప్పులు చేసి పంట పెట్టుబడి పెట్టాడు. ఆదాయం రాలేదు. వేరుశెనగ పంట కోసం చేసిన అప్పులు వడ్డీలకు వడ్డీలుగా పెరిగిపోతున్నాయి. బ్యాంకులు, సొసైటీల్లో దాదాపుగా 25 వేలు, గ్రామంలో రైతుల వద్ద 11 వేలు అప్పులున్నాయి. వత్తిడి అధికమయింది. బ్యాంకులు, సొసైటీల నుంచి కూడా నోటీసులు అధికమైనాయి. ఒక నోటీసు వచ్చిన మరుసటిరోజే 6.1.2002న మోనోక్రోటోఫాస్‌తో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆఖరికి రహమాన్ వున్న ఇల్లు కూడా తాకట్టులో వుంది. గ్రామంలో జన్మభూమి కార్యక్రమం ఒకపక్క జరుగుతూ ఉండగా రహమాన్ ఆత్మహత్య వార్త గుప్పుమంది. ఒకప్పుడు బలమైన సంస్థానంగా వుండిన ఉదిపిరికొండ కోటగోడ బురుజు రహమాన్ ఆత్మహత్యకు సాక్షీ భూతంగా నిలిచి వుంది.



## హనుమంతరాయప్ప

**35** సంవత్సరాల బోయ హనుమంతరాయప్ప పెనుకొండలో బి.టి. కాలనీకి చెందినవాడు. బండి బాడుగతో బతుకును కొనసాగిస్తూ స్వంత భూమి లేనందున 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. భార్య సుజాత (28), పిల్లలు శిరీష (10), లీలమ్మ (7), హరి (5)లు. 3-4 సంవత్సరాల నుంచి పంటలు పండక, కౌలుకు చెల్లించాల్సిన ఆదాయం కూడా రాలేదు. పంట పెట్టుబడుల కోసం, కుటుంబ పోషణార్థం చేసిన అప్పుల బాధలు ఎక్కువయినాయి. ఏ దిక్కు కానరాక భారతదేశాన్ని రిపబ్లిక్‌గా ప్రకటించిన దినం జనవరి 26న (2002) తాను సాగుచేస్తున్న పొలంలోని కరెంటు తీగలు ఒంటికి చుట్టుకుని దారుణంగా ప్రాణాలు తీసుకున్నాడు.

## కురుబ చంద్రశేఖర్

**క**ళ్యాణదుర్గం మండలం మానిరేవు గ్రామానికి చెందిన కురుబ చంద్రశేఖర్ (30 సం) తనకున్న 5 ఎకరాల పొలం సాగుచేసి జీవనం సాగిస్తూ వుండేవాడు. చంద్రశేఖర్‌కు భార్య లలితమ్మ (28), ఊహ, లావణ్య అనే కూతుర్లు, సంవత్సరం వయస్సుగల విక్కి అనే కుమారుడు వున్నాడు. గత 5-6 సంవత్సరాలుగా వేరుశెనగకు పెట్టిన పెట్టుబడి గిట్టుబాటు కాక, పెట్టుబడులకోసం 50 వేల దాకా అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం కానరాక గ్రామీణ బ్యాంకులో 10 వేలు అప్పు చేసి టీ బంకు నడుపుకుంటూ వడ్డీలు కడుతూ వుండేవాడు. టీ బంకులోని ఆదాయం వడ్డీలకు చాలలేదు. మరోపక్క కుటుంబ పోషణ. వడ్డీలు కూడా సరిగా చెల్లించలేని పరిస్థితులలో అప్పులు, వడ్డీలు తీర్చమంటూ రుణదాతల వత్తిడి ఎక్కువయింది. వేరే ఏ బతుకు దారి కనిపించలేదు. పొలం అమ్మాలన్నా కొనేవాడు లేడు. తెల్లారితే ఉగాది పండుగ. పండుగనాడు పిల్లాపాపలతో ఆనందంగా గడపాల్సిన సమయంలో అప్పుల వల్ల పడ్డ మానసిక వ్యథను వర్ణిస్తూ, తనకు అప్పులిచ్చిన వారి పేర్లను రాస్తూ, మరెవ్వరూ తనలాగా అప్పులు తీసుకుని ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరుతూ రక్తంతో ఉత్తరం రాసి పెరుగన్నంలో మోనోక్రోటోఫాస్ కలుపుకుని తిని 13.4.2002న ఆత్మహత్య చేసుకున్నాడు.

## కొప్పు ఆంజనేయులు

**కూ**డేరు మండలం పి.నాగిరెడ్డిపల్లికి చెందిన కురుబ కొప్పు ఆంజనేయులు (60 సం.) గ్రామంలో నాటువైద్యుడు. అతనికి భార్య, నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. అందరికీ పెళ్ళిళ్ళయినాయి. 10 ఎకరాల భూస్వామి. వ్యవసాయాన్నే నమ్ముకున్నవాడు. పశువైద్యం చేసి వైద్యంలో మంచి పేరు తెచ్చుకున్న ఆయుర్వేద వైద్యుడు. పశువులకు, మనుషులకు కూడా వైద్యం చేసేవాడు. ఎవరి పశువులకు ఏమి రోగమొచ్చినా, చుట్టుపట్ల

7-8 గ్రామాల ప్రజలు పిలిచిందే తడవుగా ఎంతపనిలో వున్నా వెళ్ళి వైద్యంచేసి నయం చేసేవాడు. ఒక్కపైసా పుచ్చుకునేవాడు కాదు. ఆఖరికి విత్తనం విత్తేపనిలో ఉన్నా తనపనిని ఇతరులకు అప్పగించి వెళ్ళి వైద్యం చేసేవాడని ప్రతీతి. చుట్టుపట్ల గ్రామాలవారికి తలలో నాలుకలా వున్న ఆంజనేయులుకు కుటుంబ భారం అధికం కాజొచ్చింది. పిల్లలందరూ పెద్దవాళ్ళయినారు. కోడండ్లు వచ్చినారు. ఇంట్లో ఖర్చు పెరిగింది. 4 సంవత్సరాల క్రితం అదనంగా 2 ఎకరాల పొలం కొని బావి తవ్వించాడు. బావి తవ్వినకొద్దీ నీళ్లు లోపలికి పోతూనే వున్నాయి. బావి వ్యసనంగా మారి అదనంగా బోర్లు వేయించాడు. అయినా చాలినన్ని నీళ్లు పడలేదు. తెలిసినచోటల్లా అప్పులు చేశాడు. దానికితోడు అతనికున్న గొర్రెలలో 350 గొర్రెలు రోగాలొచ్చి చనిపోయాయి. సొసైటీల్లో 15 వేలు, బ్యాంకుల్లో 30 వేలు, ఆసాముల దగ్గర దాదాపు లక్ష రూపాయల అప్పు చేశాడు. వడ్డీ పాపంలా పెరుగుతూ వుంది. ఒకప్పుడు రెండు కాండ్ల సేద్యంతో వ్యవసాయం, గొర్రెలు పెట్టుకుని దర్జాగా మోతు బరిగా బతికిన ఆసామి, చుట్టుపట్ల గ్రామాల వారందరితోనూ గౌరవింపబడుతూ ఉచితవైద్య సేవలు చేస్తూ గ్రామస్థులందరికీ ఆప్తుడిగా బతికిన ఆంజనేయులు, తన 60వ ఏట, పంటలు పండక, అప్పులు తీర్చే మార్గం కానరాక, అప్పు కట్టమని అడిగించుకునే స్థాయికి దిగజారిపోయి అవమానం భరించలేక 23.01.2002న మోనోక్రోటోఫాస్ తాగాడు. ఒకప్పుడు అందరికీ కావల్సిన వ్యక్తి ఎవరికీ కాకుండా పోయాడు.

## అలిమినేని లీలావతి, కొండయ్య

**యా**డికి మండలం గుడిపాడు గ్రామంలోని అలిమినేని కొండయ్య (50), అలిమినేని లీలావతి (42 సం.) భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె వున్నారు. కొడుకు పెళ్ళి చేసుకుని తాడిపత్రిలో పాలిష్ బండల ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా కూతురుకు పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోయింది. తనకున్న నాలుగెకరాల భూమితోనే గుట్టుగా భార్యాబిడ్డలను పోషించుకుంటూ వచ్చిన కొండయ్య కూతురు పెళ్ళికోసం అప్పులు చేయాల్సి వచ్చింది. పక్క గ్రామంలోని కుందనకోటలో వడ్డీ వ్యాపారస్థుని దగ్గర చేసిన 50 వేల అప్పు వడ్డీతో కలిపి లక్షా 20 వేలయింది. ప్రమాదవశాత్తు కాలుమీద బండిపడి కాలు విరగడంతో కర్నూలులో వైద్యం చేయించుకోవడానికి మరింతగా అప్పులు చేయాల్సి వచ్చింది. గత 4-5 సంవత్సరాల నుండి పంటలు పండక ఆదాయంలేక చేసిన అప్పులకు వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. 18.3.2002న గ్రామంలోని చెన్నకేశవస్వామి గుడివద్ద ఉదయం 11 గంటలకు రైతులందరూ పిచ్చాపాటి మాట్లాడుతూ కూర్చున్నప్పుడు తన మనస్సేమీ బాగులేదని, అప్పుల వాళ్ళు వత్తిడి చేస్తున్నారని కొండయ్య బాధపడ్డాడు. మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు భార్యాభర్తలిరువురు నీళ్లలో సాటిన్ పురుగుల మందు కలుపుకొని తాగారు. లీలావతి అక్కడికక్కడే మరణించింది. బతుకుతాడన్న ఆశతో కొండయ్యను అనంతపురం తరలించగా అక్కడ 20.3.2002న మరణించాడు. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోతే గ్రామంలోని వారు చందాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

## తిమ్మణ్ణ (28)

**గు**డిబండ మండలం శంకరగుళ్ళ గ్రామానికి చెందిన ఈరణ్ణ (70) కుమారుడు తిమ్మణ్ణ 15.1.2002న ఆత్మహత్య చేసుకున్నాడు. మడకశిర ప్రాంతానికి చెందిన అమరాపురం, గుడిబండ, మడకశిర మండలాలు అనంతపురం జిల్లాలోనే పచ్చని చెట్లకు, తోటలకు ప్రసిద్ధి. ఎప్పుడూ ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటూ ఏ రకమైన తగాదాలు, రాజకీయాలు లేని ప్రాంతం ఇది. ఒకప్పుడు పోక తోటలకు ప్రసిద్ధిచెందిన ఈ ప్రాంతం 10-15 సంవత్సరాల నుంచి తిరోముఖం పట్టింది. పంటలు తగ్గిపోయాయి. బావుల్లో నీరు అడుగంటిపోయింది. కరెంటు సమస్యలతో పైర్లు ఎండబెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. భూమిలేని వ్యవసాయ కూలీలకు కూడా చేతినిండా పని వున్నటువంటి ఈ ప్రాంతం స్వరూప స్వభావాలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ఈనాడు అక్కడ కూడా కరువులు తిష్టవేశాయి. ఆత్మహత్యలు మొదలయ్యాయి.

తిమ్మణ్ణ తండ్రి ఈరణ్ణ గ్రామంలో ఒకప్పుడు మోతుబరి రైతు. కుటుంబం యావత్తూ తోటల్లో శ్రమిస్తూ గౌరవంగా బతుకుతూ నలుగురిని ఆదుకునేది. ఈరణ్ణకు తిమ్మణ్ణ ఒక్కడే కుమారుడు. అతనికి భార్య రత్నమ్మ (22), కూతుర్లు వినోదమ్మ (3), లక్ష్మమ్మ (2) వున్నారు. ఈ కుటుంబానికి కాలక్రమంలో రెండు ఎకరాలు మాత్రమే మిగిలింది. గ్రామంలో పనులు దొరకలేదు. గత 3-4 సంవత్సరాల నుంచి వేరుశెనగ పంట పెట్టుబడులకు అప్పులు పెరిగిపోయినాయి. కానీ, ఆదాయం రాలేదు. రైతుల వద్ద 21 వేలు, బ్యాంకుల్లో 6 వేలు అప్పు చేశారు. అప్పులవారి బాధ అధికమయింది. మరోపక్క పనులు దొరకక తిండి గింజలు లేక కుటుంబం పస్తులు వుండవలసి వచ్చింది. ఈ పరిస్థితిని జీర్ణం చేసుకోలేని తిమ్మణ్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. వృద్ధాప్యంలో ఆసరాగా వుంటాడనుకున్న కుమారుడి మరణంతో మానసికంగా కుంగిపోయిన ఈరణ్ణ (70) కుమారుడు మరణించిన 3 నెలలకే తనూ మరణించాడు. ఈ పరిస్థితుల్లో తిమ్మణ్ణ భార్య రత్నమ్మే కూలికి వెళ్ళి అత్తను, ఇద్దరు పిల్లలను పోషించాల్సి వస్తోంది. అప్పులు ఎలా తీర్చాలో, పిల్లల్నెలా బతికించుకోవాలో తెలియక రత్నమ్మ సతమతమవుతోంది.

## తలారి క్రిష్ణయ్య

రైతుల ఆత్మహత్యలకు నిరసనగా కాంగ్రెస్, వామపక్ష పార్టీలు 21.2.2002 నుండి జిల్లా వ్యాప్తంగా 40 గంటల రోడ్డు బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌ను ఆపేందుకు ముఖ్య

మంత్రి రెండు రోజుల ముందే జిల్లాకు ఒక ప్రత్యేక ప్యాకేజి ఉందని అసెంబ్లీలో ప్రకటించాడు. కాని ఈలోగానే పుట్లూరు మండలం కందగోపుల గ్రామానికి చెందిన రైతు తలారి క్రిష్ణయ్య (32) 21-2-2002 ఆత్మహత్య చేసుకున్నాడు.

క్రిష్ణయ్యకు స్వంతంగా మూడెకరాల పొలం వుంది. ఈ మూడెకరాలలో గత అయిదు సంవత్సరాలుగా ఏమీ పండకపోవడంతో అదనంగా ఆరు ఎకరాలు గుత్తకు తీసుకుని సాగుచేశాడు. పురుగు మందులకోసం, ఎరువులకోసం, విత్తనాలకోసం వేలాది రూపాయలు అప్పులు తెచ్చి భూమిలో పోశాడు. వేసిన వేరుశెనగ పంట పోయింది. పొద్దుతిరుగుడు వేసినా పెట్టుబడి కూడా రాలేదు. అయిదుగురు పిల్లల్ని, భార్యను పోషించడానికి కూలికి వెళ్ళసాగాడు. వడ్డీలు తీర్చడానికి కూడా సాధ్యం కావడం లేదు. ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజి అతనికి ధైర్యం ఇవ్వలేకపోయింది. పిల్లల పస్తులు చూడలేక,వడ్డీ వ్యాపారుల వత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. క్రిష్ణయ్యయితే తన సమస్యల్నుంచి తాత్కాలికంగా తప్పించుకున్నాడు గానీ, అతను బతికుంటే కనీసం ఒకపూట అయినా తిండి తినగలిగే భార్యాపిల్లలు ఇప్పుడు తిండికిలేక, అప్పులవారి ఒత్తిళ్ళు భరించలేక సతమతమవుతున్నారు.

### నారాయణస్వామి

**క**దిరి మండలంలోని కె.బత్తలపల్లి గ్రామంలోని గ్రామస్తులందరూ ఆరోజు ఒక పూరింటి ముందు గుమిగూడారు. పార్వతమ్మ (20) అనే ఒక రైతుమహిళ కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. వెంకటరమణ అనే పేరుగల నాలుగేళ్ళ పిల్లవాడు "అమ్మా నాయన ఊరికి పోయినాడంట, ఎపుడొస్తాడు" అని అడుగుతున్నాడు. అక్కడ గుమిగూడిన వారెవ్వరికీ, ఆ పిల్లవానికి సమాధానం చెప్పడానికిగానీ, ఆ అమ్మాయిని ఓదార్చడానికి గానీ చేతకావడం లేదు. కారణం నూరేళ్ళూ తనకు అండగా నిలబడి తనను సంరక్షిస్తాడనుకున్న భర్త అర్థాంతరంగా తనను, పసివాడిని అనాథలుగా మారుస్తూ బలవన్మరణం చెందడమే.

నారాయణస్వామికి స్వగ్రామంలో 1.60 ఎకరాల పొలం వుంది. ఉండడానికి ఒక పూరి గుడిసె వుంది. ఆ పొలంతోపాటు నల్లచెరువు మండలంలోని కె.పూలకుంట గ్రామంలో భార్య వాటాగా రెండెకరాల పొలం వుంది. భార్య, ఒక కుమారుడు మాత్రమే వున్న నారాయణస్వామి నిజానికి ఏ సమస్యా లేకుండా బతకవచ్చు. అయితే అతను నమ్ముకున్న భూమి అతన్ని అలా బతకనివ్వలేదు. గత నాలుగు సంవత్సరాలుగా వేరుశెనగ పంట పెట్టుబడులకు అప్పులు చేశాడు. సొసైటీల్లో 7 వేలు, ప్రైవేటు వ్యక్తుల వద్ద 35 వేలు చేసిన అప్పులకు వడ్డీ తలకు మించిన భారమయింది. కనీసం వడ్డీ అయినా చెల్లిద్దామని కదిరికి వచ్చి తోపుడు బండిలో కూరగాయల వ్యాపారం మొదలుపెట్టాడు. అక్కడ కూడా అతని ప్రయత్నం సజావుగా సాగలేదు. పక్కటెముకల నొప్పి అధికం కావడంతో ఏ పనీ చేయలేక



పోగా వైద్యానికి మరికొంత అప్పుచేయాల్సి వచ్చింది. వడ్డీలు కట్టలేని పరిస్థితులలో భార్య వాటాగా వచ్చిన భూమిని అమ్మజూపాడు. ఎవరూ కొనలేదు. భార్య తోడబుట్టిన వారిని సాయమడిగాడు. వారి పరిస్థితి కూడా అంతే దిగజారిపోయి వుంది. ఇక ఏ దారీ తోచక 11.5.2002న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

## స్త్రీలు, పిల్లలు కూడా..

**క**రువు పరిస్థితులు కుటుంబ పెద్దలైన పురుషుల్నే కాదు; మహిళలు, పసిపిల్లల్ని కూడా బలి తీసుకున్నాయి. గుత్తి మండలం జక్కలచెరువుకు చెందిన రైతు రామాంజనేయులు 19.9.2000న ఆత్మహత్య చేసుకోగా, ఆయన కూతురు అనిత 10 సంవత్సరాల అమ్మాయి ప్రాణానికి ప్రాణంగా పెంచిన తండ్రి ఆత్మహత్య చేసుకోవడం భరించలేకపోయింది. తాను కూడా తండ్రిలాగే మోనోక్రోటోఫాస్ తాగి 22.9.2000న ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం మండలం క్రిష్ణమరెడ్డిపల్లికి చెందిన కురుబ సుధాకర్ 19.10.2000న ఆత్మహత్య చేసుకుంటే అదే దినం ఆయన ఒకే ఒక్క కూతురు ముక్కుపచ్చలారని ఏడాది పసిపాప నవ్యతో సహా ఆ యువరైతు భార్య గంగాదేవి కూడా విషం తీసుకుంది. బిడ్డ అదే దినం మరణించగా గంగాదేవి మృత్యువుతో పోరాడుతూ 21.10.2000న మరణించింది.

### చంద్రకళ

**త**ల్లిదండ్రులకు బరువు కాకూడదని చంద్రకళ (14 సం) 27.12.2001న ఆత్మహత్య చేసుకుంది. మడకశిర మండలంలోని పత్తికుంట గ్రామానికి చెందిన ఆలప్ప (55) అనే రైతుకు తల్లి, భార్య, ఆరుగురు బిడ్డలు వున్నారు. వారి పేర్లు విజయమ్మ (25), చంద్రకళ (14), లక్ష్మమ్మ (10), మంజులమ్మ (8), రత్నమ్మ (6), సుమిత్రమ్మ (4). పెద్దకూతురు విజయమ్మకు రెండేళ్ళ క్రితం పెళ్ళి చేశారు. ఆలప్పకు ఎకరా మెట్టపొలం, అర ఎకరా నీటి పారుదల భూమి వుంది. కూతురి పెళ్ళికి ఆ అర ఎకరా నీటిపారుదల భూమి అమ్మాడు. నాలుగు సంవత్సరాల నుంచి వేరుశెనగ పంట రావడం లేదు. కుటుంబ జీవనంకోసం, పంట పెట్టుబడులకోసం దాదాపు 20 వేల దాకా అప్పులు చేశాడు. కుటుంబ స్థితిగతులు, పేదరికం, తండ్రి పడుతున్న కష్టాలు చూసి, తనవారికి బరువుగా మారకూడదని చంద్రకళ విషం తాగి ఆత్మహత్య చేసుకుంది.

### మల్లమ్మ

**మ**ల్లమ్మ (25) దళిత మహిళ. కంబదూరు గ్రామం. ఆమెకు 8 ఏళ్ళ వయసున్న కుమారుడు, 6 సంవత్సరాల వయస్సున్న కుమార్తె వున్నారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తోంది. స్వంత గ్రామంలో జరుగుబాటు లేక, చేసిన అప్పులు తీరక మల్లమ్మ భర్త

కర్ణాటకకు వలస వెళ్ళాడు. పనులు దొరకక పిల్లల్ని సాకడం మల్లమ్మకు కష్టమయిపోయింది. తెల్లారితే ఉగాది పండుగ. పిల్లలకు కొత్త బట్టలుకానీ, వంటచేసి పెట్టే స్థితిలో గాని లేదు. బతుకు భారంగా తోచింది. పురుగుల మందు తాగి, కన్నపేగుల్ని వదిలి 10.4.2002న ఆత్మహత్య చేసుకుంది.

## లక్ష్మీదేవి

**గుం**తకల్లు మండలం దోసలుడికి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (35) అనే రైతు మహిళ 27.4.2002న పురుగుల మందుతో ఆత్మహత్య చేసుకుంది. తన భర్త కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న భూమిలో వ్యవసా పెట్టుబడుల కోసం చేసిన అప్పులు చెల్లించడానికి కూడా పంట రాలేదు. అప్పులు, కుటుంబ సమస్యలు ఎక్కువవడంతో ఆత్మహత్య చేసుకుంది.

## ఫీజులు కట్టలేక చిన్నారుల ఆత్మహత్యలు

**త**నకల్లు మండలం మండ్లిపల్లికి చెందిన రాధమ్మ (16) పదవ తరగతి చదువుతూంది. తండ్రి వ్యవసాయ జూదంలో నష్టపోయాడు. పదవ తరగతి ఫీజు కట్టడానికి అప్పు పుట్టించ డానికి కూడా అశక్తుడయ్యాడు. పూటకు సరిగా తిండి లేకున్నా ఎంతో కష్టపడి చదువుకున్న చదువుకు పరీక్ష ఫీజు కూడా చెల్లించలేకపోవడంతో మనస్తాపం చెంది రాధమ్మ 20.12.2001న ఆత్మహత్య చేసుకుంది.

ఓ.డి. చెరువు మండలం మామిళ్ళకుంటపల్లికి చెందిన జయలక్ష్మి (11సం) ఓ.డి. చెరువులోని ఒక ప్రైవేట్ కాన్వెంట్‌లో 7వ తరగతి చదువుతూంది. చక్కటి దస్తూరి, శ్రావ్యమైన గొంతు, చదువుల్లో చురుకుదనం జయలక్ష్మి సొత్తు. తల్లిదండ్రులు ఎంతో అపురూపంగా పెంచుకున్నారు. పంటలు పండక చేసిన అప్పులు తీరక తండ్రి వలసపోయాడు. వేరుశెనగ పంట పీకడానికి కూల్లు గిట్టుబాటు కాకపోవడంతో తల్లిదండ్రులు 5 ఎకరాల పొలంలో పంట అలాగే వదిలేశారు. తనకు, తన తమ్ముడికి స్కూలు ఫీజులు కట్టాలి. ఈ పరిస్థితుల్లో తన చదువు మానిపిస్తారని జయలక్ష్మి భయపడింది. ఆదివారం సెలవు కావడంతో చేనుకు వెళ్ళి తానే పంట పీకడానికి ప్రయత్నం చేసింది. సాధ్యం కాలేదు. కూలి వలసలకు వెళ్లి ఒకటవ తారీఖున వస్తానన్న తండ్రి రాక ఒకరోజు ఆలస్యం అయింది. దాంతో ఆదివారం రాత్రి 2.12.2002న ఇంట్లో ఉరివేసుకుని మరణించింది.

## తనువు చాలించిన రైతుమహిళలు

**కూ**డేరు మండలం గొటుకూరు గ్రామంలో వ్యవసాయ భారాన్ని మోస్తూ వేరుశెనగ నష్టాల్ని భరించలేక ఇద్దరు మహిళలు ఆత్మహత్యలు చేసుకున్నారు. వీరిలో ఒకరైన కురుబ నాగలక్ష్మి (35) 21.2.2002న విషంతాగి ఆత్మహత్య చేసుకుంది. భర్త వ్యవసాయాన్ని సరిగా



పట్టించుకోవడం లేదని భర్తను, ఇద్దరు పిల్లల్ని బతికించుకోవడానికి ఆమే వ్యవసాయం చేయిస్తూ వుంది. నాలుగు సంవత్సరాలుగా పంటలు పండలేదు. వేరుశెనగకోసం చేసిన అప్పులు తీరడం లేదు. కుటుంబం గడవడం కూడా కష్టమైపోయింది. దాదాపు 20 వేలు అప్పు అయింది. తీరేమార్గం కనబడలేదు. మరుసటి సంవత్సరమైనా పంట పండుతుందన్న నమ్మకం లేదు. దాంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. అదే గ్రామంలో జయమ్మ అనే మహిళ కూడా స్వంతంగా వ్యవసాయం చేయడం మొదలుపెట్టింది. ఇద్దరు పిల్లలు, భర్త వున్నారు. బ్యాంకులో రూ.14,000/-లు, రైతుల వద్ద రూ.22,000/-లు అప్పు అయింది. పంటలు పండలేదు. అప్పులు తీరే మార్గం కనపడలేదు. ఆత్మహత్య చేసుకుంది. (మొత్తం ఆత్మహత్యలు చేసుకున్న మహిళలు, వారి అనుబంధంలో ఇవ్వడం జరిగింది)

జిల్లాలో మొత్తం ఆత్మహత్యలు ఇవి మాత్రమే అనుకుంటే పొరపాటు. నేరుగా వ్యవ సాయంతో సంబంధముండి పంటల నష్టంతో, అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న వారిని మాత్రమే ఇక్కడ పరిగణనలోనికి తీసుకోవడం జరిగింది. నిజానికి జిల్లాలో ప్రతి సంవత్సరం అనేక కారణాలచేత ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య రాష్ట్రంలో అన్ని జిల్లాలకంటే అధికంగా వుంటోంది.

ఉదాహరణకు 2001 సంవత్సరంలో జిల్లాలో వివిధ కారణాల వల్ల ఆత్మహత్యలు చేసుకున్నవారి వివరాలు ఇవీ (అధికారిక లెక్కల ప్రకారం):

| | | |
|---|---|---|
| విషం తీసుకొని మరణించినవారు | : | 477 |
| ఉరివేసుకొని చనిపోయినవారు | : | 107 |
| కాల్చుకుని చనిపోయినవారు | : | 71 |
| నీళ్ళలోకి దూకి మరణించినవారు | : | 41 |
| ఇతర పద్ధతుల ద్వారా.. | : | 3 |
| **మొత్తం** | : | **699** |

**జిల్లాలో పెరిగిపోతున్న నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం సర్వవ్యాపిత సంక్షోభానికి అద్దం పడుతున్నది.**

## జిల్లా రైతులు పిరికివారా?

కాదు. నిస్సందేహంగా రైతులు ఆత్మహత్యలు చేసుకునేంత పిరికివారు మాత్రం కాదు. గత చరిత్రను పరిశీలిస్తే రైతులు చాలా శ్రమకోర్చి వ్యవసాయం చేశారనేది అర్థమవుతుంది. తక్కువ వర్షపాతం, సారవంతం కాని నేలల్లో వ్యవసాయం బతికి బట్టకట్టిందంటే రైతుల కఠోర శ్రమ వల్లనే అది సాధ్యమైంది. ప్రకృతి వైఫల్యాల వల్ల గతంలో జిల్లాలో ఎన్నో

కరువులు సంభవించాయి. ఒక్కొక్కసారి వరుసగా రెండు మూడు సంవత్సరాలు కరువులు తిష్టవేసిన సందర్భాలు వున్నాయి. ప్రజలు, పశువులు తిండి, మేత లేక ఆకలితో చనిపోయిన సందర్భాలున్నాయి. కానీ రైతులు ధైర్యంవీడి ఆత్మహత్యలు చేసుకోలేదు. విద్య, నాగరికత అంతగాలేని స్థానిక పాలెగాళ్ళే రైతుల అవస్థలను చూసి చాలా గ్రామాలలో చెరువులు, కుంటలు, ఊటకాలువలు లాంటి నీటి ఆధారిత వనరుల్ని నిర్మించారు. సాంకేతిక విజ్ఞానం అందుబాటులో లేని కాలంలో కూడా నీటి మార్గాలను గుర్తుపట్టి, చెరువు కట్టలు నిర్మించ డానికి అనువైన ప్రదేశాల్ని ఎంపికచేసి, నీటి కట్టడాల్ని నిర్మించారు. వీటిని గుర్తించ డంలో స్థానిక రైతుల విజ్ఞానం ప్రధానపాత్ర వహించిందన్న విషయాన్ని గమనిస్తే మన రైతుల విజ్ఞాన సామర్థ్యం మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆనాడు రైతులు ప్రకృతికి వ్యతిరే కంగా పోరాడి వ్యవసాయాన్ని పాదుగొల్పారుగానీ ఆత్మహత్యలు చేసుకోలేదు. స్వాతంత్రం వచ్చిన తరువాత,సాంకేతిక విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, ప్రభుత్వాలు అనుస రించిన విధానాల వల్ల రైతులు భూమినుంచి దూరమయ్యారు.

## సంక్షోభానికి దారితీసిన క్రమం

రాష్ట్రంలో అన్నిటికన్నా ఎక్కువ విస్తీర్ణం గల జిల్లా అనంతపురం జిల్లా. దీని వైశాల్యం 19,130 చ.కి.మీ. రాష్ట్ర ధాన్యాగారాలుగా పేరుపడ్డ ఉభయ గోదావరి జిల్లాల విస్తీర్ణం 18 వేల చ.కి.మీ. మాత్రమే. వాటితో పోల్చితే అనంతపురం జిల్లాలో జనసాంద్రత చాలా తక్కువ. మొత్తం జనాభా 32 లక్షలు మాత్రమే. దీనినిబట్టి ఈ జిల్లా సహజంగా అభివృద్ధి చెందాల్సిన స్థాయిలో అభివృద్ధి చెందలేదనేది అర్థమవుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగ్గా వున్నప్పుడు జనసాంద్రత పెరుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు కూడా స్థిరపడతారు. అనంతపురం జిల్లాలో మెట్ట వ్యవసాయం తప్ప మరో జీవన వనరు లేని కారణంగా బయటి ప్రాంతం నుంచి వచ్చి ఈ జిల్లాలో ఎవరూ స్థిరపడలేరు. పైగా ఈ జిల్లానుండే ఉపాధి వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడుతున్నారు. ఈ రకంగా 40-50 సంవత్సరాలలో భూవసతి లేని చాలామంది దళితులు, ఇతరులు ఇతర ప్రాంతా లకు వెళ్ళి స్థిరపడ్డారు. జిల్లాలోని 24 లక్షల సాగుయోగ్యమైన భూమిలో 90 శాతం భూమి వర్షాధారమైనదే. కురిసే అతితక్కువ వర్షపాతం కూడా కురవవలసిన సమయంలో కురవక పోవడంతో పంటలు గ్యారంటీగా పండుతాయని నమ్మకం లేదు. స్వాతంత్ర్యం వచ్చి అర్థ శతాబ్దం దాటినా, పరిపాలనా సంబంధ మార్పులు తప్ప, ఉపాధి కల్పనలో ఏ మార్పూ లేదు. ఇప్పటికీ భూమే ముఖ్య జీవనాధారంగా వుంది. పెరుగుతున్న జనాభా అవసరాల కనుగుణంగా ఇతర ఉపాధి రంగాలు విస్తరించినపుడు వ్యవసాయం మీద ఒత్తిడి తగ్గు తుంది. కాని అవేమీ లేకపోవడం, బయటినుండి నీటివసతి లేకపోవడంతో విచక్షణా



రహితంగా భూగర్భ జలాల్ని బయటికి తీసి వ్యవసాయం విస్తరింపజేశారు. బావులనుంచి నీటిని తోడడా నికి కరెంటు వాడకం అవసరమయింది. మార్కెట్ ప్రచారం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న 'ఆధునిక వ్యవసాయ పద్ధతుల' ప్రభావంతో సేంద్రీయ పేడ ఎరువుల స్థానంలో రసాయనిక ఎరువుల వాడకం ఎక్కువయింది. రసాయనిక ఎరువుల వాడకం ఫలితంగా వచ్చిన తెగుళ్ళు పోగొట్టుకోవడానికి రసాయన మందుల అవసరం ఎక్కువ యింది. ఈ రకంగా రైతు శ్రమ మాత్రమే పెట్టుబడిగా వ్యవసాయం చేసే దశనుంచి రైతు శ్రమ పాత్రను తగ్గిస్తూ, మార్కెటు శక్తులైన కరెంటు, రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందులు ప్రధానపాత్ర వహించాయి. అనివార్యంగా రైతు ఈ మార్కెటు శక్తులకు తల ఒగ్గక తప్పలేదు. రైతుకు తన ఉత్పత్తికి ధర నిర్ణయించుకునే అధికారం లేదు గానీ, మార్కెట్ శక్తులకు మాత్రం తమ వ్యాపార వస్తువుల ధరల్ని శాసించుకునే అధికారం వుంది. అందుకే ప్రతి పదేళ్ళకు రైతు అవసరాలైన రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతర ఉత్పత్తుల ధరలు రెండింతలుగా పెరుగుతూ వుంటే, రైతు పండించే ధాన్యం, ఇతర వాణిజ్య పంటలకు ధరలు కొన్ని సందర్భాలలో ఏమీ పెరగకపోవడం జరుగుతూంది. రైతుకు బాగా పంట పండితే తప్ప గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడింది. పూర్తి పంటకు ఏ కొంచెం తగ్గినా రైతుకు నష్టం గానే పరిణమించి, రైతు తాను బతకడం కోసంకాక వ్యాపార వర్గాల వారిని బతికించడం కోసమే వ్యవసాయం చేస్తున్నట్లుగా వుంది. ఈ ప్రత్యేక పరిస్థితులలో రైతులు వ్యవసాయ ఖర్చులను, పెరుగుతున్న కుటుంబ అవసరాల్ని తట్టుకోవడానికి క్రమంగా వాణిజ్యపంట అయిన వేరుశనగ పంట వైపు మళ్ళారు.

## వేరుశెనగ ప్రాధాన్యం

1980 నుంచీ వేరుశెనగకు మంచిరేటు రావడంతో, జిల్లాలో చాలామటుకు ఒకే పంట విధానంగా మారిపోయింది. ఈ జిల్లా వాతావరణం, నేలలు కూడా వేరుశెనగకు బాగా అనుకూలించాయి. ముఖ్యంగా టి.యం.వి. 2 వేరుశెనగ రకం. బెట్టకు తట్టుకునే స్వభావం వుండడం మూలంగా అదునులో 3-4 మంచి వర్షాలు కురిస్తే పంట పండిపోతుంది. అందుకే 1975-76లో 8 లక్షల ఎకరాల సాగువున్న వేరుశెనగ 2000-01 నాటికి 19 లక్షలకు పెరిగింది. దీని పర్యవసానంగా 1975-76లో ఆహార ధాన్యాల పంట విస్తీర్ణం 14 లక్షల ఎకరాలు వుంటే, అది 2000-01 నాటికి రెండు లక్షల 32 వేల ఎకరాలకు తగ్గిపోయింది. ఈ రకంగా తగ్గడానికి రైతు అవసరాలేకాక, భూగర్భ జలమట్టం పడిపోవ డం, రసాయనిక ఎరువుల వాడకం అధికం కావడం, దానివలన భూమిలో ఉష్ణోగ్రత పెర గడం, ఫలితంగా ఇతర పంటలు పండలేకపోవడం కూడా కారణాలే. వీటిని సమతుల్యం చేయడంకొరకు సంప్రదాయక నీటివనరులైన చెరువులు, కుంటల్ని కాపాడుకోవడానికి,

భూగర్భ జలవనరుల్ని పెంచడానికి గట్టి ప్రయత్నం చేయకపోగా బయటనుంచి నీటిని మళ్ళించే దిశగా ప్రభుత్వాలు ఆలోచించకపోవడం కూడా కారణాలే. అయితే రెండు-మూడు సంవత్సరాలకు ఒక పూర్తి పంట పండినా, రైతులకు జరుగుబాటు అవుతూ వచ్చింది.

## సామాజిక మార్పులు

రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాక రాష్ట్రంలో అభివృద్ధి చెందిన ప్రాంతాలతో కూడా జిల్లాకు దగ్గరి సంబంధాలు ఏర్పడ్డాయి. సామాజికంగా ప్రాంతాల మధ్య దూరం తగ్గిపోయిం తర్వాత అభివృద్ధి చెందిన ప్రాంతాల స్థాయికి మనవాళ్ళు వెళ్ళకపోయినా, అక్కడి అలవాట్లు, జీవిత విధానాలు, ఖర్చులు మనకు అంటుకున్నాయి. 1970 వరకూ గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్లల పెళ్ళిళ్ళకు పెద్దగా కట్నకానుకలు వుండేవికావు. వారి సాంఘిక హోదా, స్థాయిని బట్టి బంగారం మాత్రమే కానుకలుగా ఇచ్చేవారు. క్రమేణా ఒక అంటురోగం లాగా గ్రామీణ ప్రాంతాలలోని అన్నిస్థాయిల కుటుంబాలకూ ఇది వ్యాపించింది. ఆఖరికి సాంఘికంగా వెనుకబడిన కులాలలో కూడా ఈనాడు ఆడపిల్లల పెళ్ళిళ్ళకు డబ్బు రూపంలో కట్నం డిమాండ్ చేయడం ఎక్కువయింది. గ్రామీణ ప్రాంతాలలో చాలా అరుదుగా ఉండే మహిళల ఆత్మహత్యలు ఇప్పుడు కట్నకానుకల కారణంగా పెరిగిపోతున్నాయి. అంతేకాకుండా వేరుశెనగ వాణిజ్య పంటగా ఆదాయాన్నిస్తుండడంతో అప్పుల స్థాయి కూడా ఎక్కువయింది. ఒకప్పుడు 10 ఎకరాల ఆసామికి 10 వేల అప్పంటే గొప్ప. ఇప్పుడు అవలీలగా లక్షనుండి 5 లక్షల వరకూ అప్పులు చేయగలుగుతున్నారు. పాలక పార్టీలో రాజకీయంగా పదవులు సంపాదించినవారు, కాంట్రాక్టులు, దొంగసారా వ్యాపారాలు చేసే కొద్దిమంది తప్ప ఈనాడు జిల్లాలో ఎకరా నుండి 100 ఎకరాలు కలిగిన ప్రతి రైతుకూ అప్పు వుంది. ఒక కుటుంబంలో ఒక ఆడపిల్ల పెళ్ళికి చేసిన అప్పు తీరడానికి కనీసం 10 సంవత్సరాల వ్యవధి అవసరమవుతున్నది. అదికూడా సక్రమంగా పంటలు పండితేనే. గత 3-4 సంవత్సరాలుగా వరుసగా పంటలు పండకపోవడం వల్ల, అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితులలో ప్రైవేట్ రుణదాతలు, బ్యాంకులు, సొసైటీలు ఒకేసారి వొత్తిడి చేయడం మూలంగానే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని రుణాల్ని మాఫీ చేయగలిగితే ఆత్మహత్యలు కూడా ఆగిపోతాయి. వ్యవసాయం ఒక సామాజిక బాధ్యతగా వున్నప్పుడే రైతుల్ని ఏ మాత్రం ఆదుకోని ఈ ప్రభుత్వాలు, ఇప్పుడు ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో అన్నిరకాల సబ్సిడీలను ఉపసంహరించుకుంటున్న పరిస్థితులలో వారికి కనీస సహాయం చేస్తుందన్న ఆశ కూడా లేదు. ప్రతిపక్షాలు 40 గంటల రోడ్డు బంద్‌కు రైతుల నుంచి అనూహ్యంగా స్పందన రావడంతో బెంబేలెత్తిన ప్రభుత్వం అసెంబ్లీలో



అనంతపురం జిల్లాకు ప్రత్యేక ప్యాకేజిని ప్రకటించినా, ఇంతవరకు వాటికి ఆర్థిక కేటాయింపులు జరపకపోవడం గమనించాలి.

## ప్రస్తుత పరిస్థితి

